# అన్వేషణ

శ్రీ ఆర్. యం. చిదంబరం

'అయ్య నాయనోయ్ !' అనరిచాడు శేఖర్.

రఘు ఉలిక్కిపడ్డాడు. ఆకాశానికి వంకరమెట్లు కడుతున్న సిగరెట్టు నేలమీదకు జారిపడింది.

'ఏమైందిరా బాబూ ! .... తేలు కనపడిందా ? .... లేక పుస్తకాలమధ్య పాము కదలిందా ? అందమైన అమ్మాయి బొమ్మ ఏదైనా అగుపడిందా ? .... ఓ ! సారీ ! నువ్వు పెళ్లయినవాడివి. పరస్త్రీలను కంటితో చూడవు. మనసులో తల్చుకోవచ్చులే ! ఎందుకంటే ఎవరూ కొనుక్కోలేరు. ఇంతకూ సంగతేవిటి ?' అనడిగాడు శేఖర్ భుజంమీద చేతులు వేస్తూ రఘు.

"నువ్వు కనుక్కున్న కారణాలు సత్యదూరమైనవి .... ఇన్ని సంవత్సరాలుగా మీ ఇంటికి వస్తున్నాను కాని, ఒక్కసారైనా నీ రీడింగురూం చూడలేదు. మైగాడ్! .... ఏమి పుస్తకములు ! ఏమి పుస్తకములు ! తలగడ లనుకుంటాను. ఇవన్నీ ఎలా చదవగలుగుతున్నావు బాబూ ! .... చదివేందుకే జీవితకాలం చాలనప్పుడు అర్థం చేసుకునే దెప్పుడు? .... ఆ! .... తెలిసింది! ఇదంతా షో కోసం. రఘు అఖండ ప్రజ్ఞావంతుడని అందరూ అనుకునేందుకు."

'ఓసి నీ ఇల్లు కాల ! ఈ మాత్రం దానికే ఇంత బెంబేలు పడిపోయావా చిట్టితండ్రి ! .... కొత్తరకం చిక్కులు వస్తే రిఫరెన్సు కోసం ఈ పుస్తకాలు—నువ్వన్న ఆఖరుమాట కూడా నిజమే ననుకో. నలుగురూ నేను గొప్పవాణ్ణనుకోవాలిగా ! .... అందుకని అందంగా అమర్చి ఉంచాను. ఇదంతా రహస్యం సుమా ! ఎవరికీ చెప్పవోక !'

ఇద్దరూ . పకపక నవ్వుకున్నారు.

'ఒక్కొక్కప్పుడు నాకు ఆశ్చర్యం కలుగుతుంది. ఆలోచిస్తూ కూర్చుంటాను. అన్యాయ మనేది ఉండకూడదని అందరూ బోధిస్తారు. నేరస్థులను శిక్షించేందుకు ప్రభుత్వం, చట్టం, కోర్టులు, అన్నీ ఉన్నాయి. అయినా భయంలేకుండా మోసం, దగా, దొంగతనం జరుగుతూనే ఉన్నాయి. కనక న్యాయస్థానం, న్యాయం ఎందుకు ? ఈ 'లా' పుస్తకాలు చదవకు. ఇవన్నీ తప్పును ఒప్పుగాను, మంచిని చెడుగాను నిరూపించేందుకే !'

రఘు అతని ఆవేశాన్ని చూసి నవ్వుకున్నాడు.

'పోనీ—అన్యాయం జరిగినప్పుడు ఆ వ్యక్తి ఏంచేయాలో నువ్వే చెప్పు—చూద్దాం.'

'మోసగించిన మనిషిని క్షమించి, గప్‌చిప్‌గా వూరుకుని, మరో మార్గం వెతుక్కోవాలి. పగ తీర్చుకున్నందున ప్రయోజనం ఉండదు. ఉదాహరణకు, ఏదో కారణంచేత భార్యను భర్త వదిలేశా డనుకో— ఆమె కోర్టుకెక్కి అతని నేరాన్ని నిరూపించినంతమాత్రాన ఆమె కొరిగే దేమిటి ? అతను ఎలాగూ తిరిగి ఏలుకోడు .... తనదారి చూసుకోటం ఉత్తమం.'

రఘు ఏదో అనబోయాడు.

'వాదోపవాదాలు మానుకుని, వేడివేడి కాఫీ తాగండి .... న్యాయాన్యాయాల్ని గురించి చర్చించి తీర్పుచెప్పే అనుభవం మీకింకా రాలేదు. వయసులో చిన్నవారు' అంది అప్పుడే వచ్చిన రఘు తల్లి సుభద్రమ్మ. ఆ ఇద్దరు మిత్రుల మధ్య ఉండే అనురాగాన్ని చూసేసరికి ఆమె కళ్లు చెమర్చాయి.

ఇద్దరూ కాఫీ తాగటం పూర్తిచేశారు.

'రఘు !—నువ్వు హృదయం లేనివాడివి ! దుర్మార్గుడివి ! జాలి, దయ లేని ఎడారిలాంటిది నీ మనసు !'

'మళ్లీ మొదలుపెట్టావు ! ఏమొచ్చిపడింది ?' అన్నాడు మరో సిగరెట్టు ముట్టిస్తూ.

'ఈ తిట్లు పట్టిక ఎందుకో తెలుసా ? పెళ్లికి రమ్మని ఆహ్వానిస్తే వచ్చావుకావు. ఆఫీసు పనిమీద కాంప్ వెళ్లాలన్నావు. ఎలాగో మనసు సరిపెట్టుకున్నా. పెళ్లయి నెల రోజులైంది. ఇంతవరకూ నీ దయ కలుగలేదు. నీ గురించి నిరంతరం ఏదో వాగుతుంటే మా ఆవిడ 'చాల్లెండి ! మీరూ, మీ స్నేహితులూ—ఏదో ప్రాణస్నేహితుడని డప్పాలు కొడతారు కాని ఒక్కనాడైనా మనింటికి వచ్చారా ? మీరు అమాయకులు. అందర్నీ నమ్ముతారు' అని కస్సుమంది.

రఘుకూడా బాధపడ్డాడు.

'అన్నీ తెలిసివుండి ఎగిరిపడుతున్నావ్. కాంప్‌నుండి వచ్చి మూడు రోజులే అయింది. రాత్రి ఇల్లు చేరుకునేసరికి తొమ్మిది దాటుతోంది. అర్థరాత్రి వచ్చి నిన్ను డిస్టర్బ్ చేయటం ఏం బాగుంటుంది ? రేపు ఆదివారం—సెలవు కనక వస్తాను.'

శేఖర్ బయలుదేరటానికి సిద్ధమవుతూ ఎర్రటి అట్టతో ముచ్చటగా ఉండే ఓ లావాటి పుస్తకం తీసి పేజీలు తిరగవేశాడు. ఏదో జారి కిందపడింది. ఇద్దరూ ఒక్కసారి కిందకు వంగారు. కార్డుసైజు ఫోటో శేఖరానికి దొరికింది.

ఫోటోలోంచి చిరునవ్వులు విసిరే అమ్మాయికేసి చూశాడు.

కళ్లు చీకట్లు కమ్మాయి.

శరీరం వణికింది. ప్రతి అణువూ ఆవేదనతో ఆక్రోశించింది.

ముళ్లకంచెమీద నడక—అగ్నిజ్వాలల చుట్టివేత—చీకటి పొగుల ఉరి బిగింపు—అన్నీ ఒక్కసారిగా ఎదుర్కొన్నాయి. కాళ్లకింద భూమి చీలి కళ్లు తిరిగాయి.

రఘు కంగారుపడ్డాడు.

శేఖర్ భుజంమీద చేతులువేసి కదిపాడు.

'శేఖర్ ! ఏమైంది ? .... ఆ అమ్మాయిని నీకు తెలుసా? లేక నీకు బంధువా ?'

'చుట్టరికంలేదు కాని ఎక్కడో చూసిన గుర్తు. అది సరేకాని ఎవరీ సుందరి ? చాలా బాగుంది. ఏమైనా కథ నడిపించావా ?' అంటూ పెద్దగా నవ్వాడు.

రఘు విషాదంగా చూశాడు.

'మనిషన్నవాడు ఏదో తప్పు చేస్తాడు. కారణాలు ఏమైనా తప్పును ఒప్పుగా మార్చలేడు. ఉద్రేకం వస్తే తప్పటడుగులు వేసి తీరుతాడు..... నేనూ అంతే చేశాను.'

అలికిడైతే రఘు ఆగాడు. పనిమనిషి వచ్చి గ్లాసు తీసుకుపోయింది.

'నువ్వు నా ప్రాణస్నేహితుడివి. నీ దగ్గర్నుండి ఏదీ దాచను. ఈ అనుభవం నీకు తెలియజేయాలని ఎంతోకాలం నుండి అనుకుంటున్నా. అవకాశం దొరకలేదు. అంతేకాదు .... క్షమించరాని ఓ నేరం చేసి, దాన్ని గొప్పగా చెప్పుకోటంలో ఆనంద మేముంది ? అందుకే సిగ్గుపడి బాధను మనసులో దాచుకున్నా. కంటికి కనపడకూడదని ఎక్కడో పుస్తకంలో దాచివుంచిన ఆమె రూపం మళ్లీ కనిపించి అణగారిన నా బాధను రేపింది. అంతా విన్నాక నువ్వు నన్ను తప్పకుండా అసహ్యించుకుంటావు. అవునా ?'

శేఖర్ విషాదంగా నవ్వాడు.

'కాదు రఘు !.... ఆలస్యంగా జరిగినా, ప్రేమించిన తరువాత ద్వేషించటం సాధ్యంకాదు .... అదలా ఉంచి నీ కథ నేనింకా వినలేదుగా !'

రఘు మరో సిగరెట్టు వెలిగించాడు.

'ఈ ఫోటోలో ఉన్న అమ్మాయి ఎంత అందంగా ఉందో చూశావా ? సగం మూతపడి, స్వప్నజగత్తులో విహరిస్తున్న నేత్రాలు, మాధుర్యం, మమకారం, ప్రేమ అన్నింటిని ఒక్క ఎర్రటి గీతలో యిముడ్చుకున్న పెదవులు, పొడుగాటి జెడ ఆ ఫోటోలో కూడా ఎంత చక్కగా కనిపిస్తోందో చూశావా ? .... ఇలా ఆమె సౌందర్యానికి ధర కడుతూ కూర్చుంటే కాలానికి కొలతలేదు. నీకు వినేందుకు విసుగ్గానే ఉంటుంది. అనుభవాల్ని ఎవరూ విడిగా చెప్పలేరు. అభిప్రాయాలు, ఉద్రేకాలు వెంట వస్తూనే ఉంటాయి. ఆ అమ్మాయి నా గుండెలో శాశ్వత స్థానం ఏర్పరచుకుంది.'

'రఘు ! .... ఆమెను నువ్వెక్కడ కలుసుకున్నావ్ ?'

'బి. ఎల్. పూర్తికాగానే తాతయ్యావూ రెళ్లాను. రెండు నెలలు మకాం వేశాను. పక్కింట్లోనే తల్లీ, కూతురూ ఉండేవారు. తల్లి రోగిష్టిమనిషి. సన్నగా, ఎముకలగూడులా, అస్తమానం దగ్గుతూ కనిపించేది. కూతురు అక్కడక్కడ పనులు చేసేది. ఆమెను నమిలి మింగేయటానికి ఆవూళ్లో ఎందరో ఎదురు చూస్తుండేవారు. అందర్నీ తప్పించుకుని చమత్కారంగా బతికేది. ఎప్పుడైనా వారికి మణియార్డరు వస్తుంది. ఎక్కడనుంచో నాకు తెలియదు. ఆ వివరాలు ఆమె నడగలేదు. అవన్నీ నా కనవసరం. ఆ సమయంలో నా క్కావలసింది ఆమె అందం, యౌవనం. ఆమె ఓ మధుపాత్ర అనుకో. దాన్ని అందుకుని గడగడ తాగేయాలనే తహతహ ..... నేను ముందే చెప్పాను. ఉద్రేకంలో ఎవరైనా తప్పటడుగు వేయవలసిందే ! సముద్రాల్ని సహితం ఒక్క అంగలో దాటగల మనుకుంటాం. ఆమెకోసం ఏం చేయటానికైనా సిద్ధపడ్డాను. ఆమెకూడా నాకోసం కలవరించింది. ఇద్దరి అభిప్రాయమూ ఒకటైనప్పుడు ఎవ రేంచేయగలరు ? ఉన్నట్టుండి తల్లి చనిపోవటంతో కాముకుల మధ్య ఒంటరిగా నిలబడవలసి వచ్చింది. .... అవకాశం దొరికింది కనుక ఇద్దరం మద్రాసు వెళ్లిపోయాం.'

గడియారం ఎనిమిది కొట్టింది.

'శేఖర్ ! .... నువ్వింకా ఇంటికి వెళ్లలేదూ ? అదేమిట్రా రఘు ! నువ్వు ఒంటరిగాడివి. అతనికి కొత్తగా పెళ్లయిందని, పెళ్లాం ఎదురుచూస్తూ ఉంటుందని తెలుసుకోవద్దూ ?' అని మందలించింది అప్పుడే వచ్చిన సుభద్రమ్మ.

'నీకు తెలియదమ్మా ! .... అతనికి పెళ్ళాంమీద కంటె నామీద మమకారం ఎక్కువ. 'పోరా నాయనా ! అని మొత్తుకున్నా కదలటంలేదు.'

సుభద్రమ్మ నవ్వి మేడమీదకు వెళ్లిపోయింది.

'చెడ్డపని చేయకూడదని, మనసును అదుపులో ఉంచుకునేందుకు నానాయాతనా పడేకన్న మురికిలో దిగటం మెరుగు. ఆమెతో మద్రాసంతా తిరిగాను. ఈ కొత్త జీవితం నన్ను మత్తెక్కించింది. రిజిష్టర్ మేరేజి చేసుకుంటానని ఆమెకు వాగ్దానం యిచ్చాను. మోసం చేయాలనే అభిప్రాయం ఏనాడూ లేదు. నాన్నగారికి ప్రమాదించిందని, నా ఉనికి తెలుసుకుని ఎవరో వార్త తీసుకువచ్చారు. ఆమెను హొటల్లో వదిలి, ముఖం చూపించి మర్నాడే తిరిగి వస్తానని నచ్చజెప్పి ఇంటికి వచ్చాను. ఆమె కన్నీరు ఈనాటికి మహాసముద్రంలా కనిపిస్తోంది. అందరూ చీవాట్లు వేశారు. ముఖంమీద ఉమ్మేశారు. బి. ఎల్. చదివి, భవిష్యత్తు గురించి ఆలోచించకుండా ఎవరో అమ్మాయితో చెడుగా తిరుగుతున్నానన్న వార్త వినగానే నాన్నగారు నేలమీద పడిపోయారుట. అతిగా ప్రేమించటం కూడా తప్పే ! ఎడబాటు సహించలేం. అందుకే సైగలు 'నకర్ ఇల్‌నప్యార్' అని వాపోయాడు. నాన్నగారు నన్ను మితిమించి ప్రేమించారు. రెండు రోజుల తరువాత కన్ను మూశారు. కర్మకాండ జరిగింది. ఇల్లు కదలనీయక అందరూ నన్ను కాపలా కాశారు. నీతి బోధనలు చేశారు. 'ఆ అమ్మాయిని మర్చిపో' అన్నారు .... ఆత్మఘోష ఆగిందికాదు. అంత పెద్ద నగరంలో అనాథగా ఆమెను వదలివచ్చాననే తలపు రాగానే అందర్నీ, అన్నింటినీ విదలించి బయలుదేరి వెళ్లాను.... వారంరోజులు ఎదురుచూసి ఆమె ఎక్కడికో వెళ్లిపోయింది. ఆమెకోసం ఇంకా అన్వేషిస్తూనే ఉన్నాను.

రఘు ఆగి శేఖర్‌కేసి చూశాడు.

'పశ్చాత్తాప పడుతున్నా. పాపానికి ప్రాయశ్చిత్తం ఉంటుందా ?'

శేఖర్ నవ్వాడు.

'పాపం చేస్తున్నప్పుడు, తెలిసి విరమిస్తే మంచిది. కాని ఏ మానవుడూ అలా చేయలేడు. ఎందుకంటే పాపంలో ఆనందం ఉంది. అది క్షణికం. దూరం కాగానే 'అయ్యో ! ఇంక దొరకదే !' అని ఏడవటం, పశ్చాత్తాపం .... కాని రఘు ! ఒకందుకు నేను ఆశ్చర్యపోతున్నా. ఇంతటి చదువు, సంస్కారం, నాగరికత ఉన్న నువ్వు ఇలాంటి నీచత్వానికి ఎలా ఒడిగట్టావాని ...... '

'ఆగు శేఖర్ ! నేను చేసినపని నీచమైనదని ఒప్పుకోను. నువ్వు నా మనస్థితిని సరిగ్గా అర్థం చేసుకోలేదు. నేను ఆమెను నిజంగా ప్రేమించాను. ప్రేమిస్తున్నా.'

'సారీ ! .... కాని నలుగురూ అనుకుంటారు కదా ! .... మీ అమ్మగారు మాత్రం అనుకోరా ?'

'అమ్మ సంగతి నీకు తెలియదు. ఆమె హృదయవైశాల్యాన్ని ఎవరూ కనుక్కోలేరు.'

మిత్రు లిద్దరూ మొదటిసారిగా ఒకరి నొకరు గంభీరంగా చూసుకున్నారు. వారి మధ్యవున్న చిలిపితనం కరిగిపోయింది. ఇద్దరూ మౌనంగా ఉండిపోయారు.

'ఒకవేళ ఆ అమ్మాయి ఎదురుపడితే పెళ్ళి చేసుకుంటావా ?'

'తప్పకుండా. ఒకే గోతిలో రెండోసారి పడను.'

'ఒకవేళ ఆమెకు పెళ్ళయివుంటే ?'

రఘు ఫక్కున నవ్వాడు.

'సమాధానం నీ ప్రశ్నలోనే ఉంది !'

'కాని నీ నోటంట వినాలని ఉంది' శేఖర్ రెట్టించాడు.

'భల్లూకంలా పట్టుకు వదలవన్నమాట ! .... ఆ అమ్మాయికి భర్తుంటూ ఉంటాడు. కనక పెళ్ళిప్రశ్న లేదు ..... దానికేం జవాబు చెప్పను ? మొగుడి కళ్ళల్లో కారంకొట్టి ఆమెను బలవంతంగా తెచ్చుకోమనా నీ ఉద్దేశ్యం ? .... ఒక్క సంగతి జ్ఞాపకం ఉంచుకో. స్త్రీ జీవితంలో రెండు ముఖ్య భాగా లున్నాయి. పెళ్ళయ్యేవరకూ ఒక భాగం—తరువాత రెండోభాగం—ఈ రెంటికీ మధ్య పెద్ద ఇనుపతెర. గతాన్ని ముక్కలుగా చింపి, చిత్తుబుట్టలో పడేస్తుంది. ఎవరైనా అందులోంచి ఓ కాగితంముక్క అందిస్తే చిత్రంగా నవ్వి ఆశ్చర్యంతో కళ్ళు పెద్దవిచేసి 'ఏమిటిది ?' అని విసిరేస్తుంది.'

'నే ననేది అదికాదు .... ఒకవేళ భర్తే ఆమెను నీ కప్పగిస్తే ?'

రఘు అతనికేసి ఆశ్చర్యంగా చూశాడు.

'నువ్వు చిత్రంగా మాట్లాడుతున్నావు శేఖర్ ! ..... ఏవేవో అని నీ మనసు పాడుచేశాను. అన్నీ మర్చిపో ....ఈ అమ్మాయిని నీకు తెలిసేఉంటుంది. వా దగ్గర్నుండి ఏదో లాక్కున్నావ్.'

శేఖర్ తృప్తిగా నవ్వాడు.

'అదేంలేదోయ్ వెర్రి దద్దమ్మా ! .... తమాషాకి అన్నానంతే ! నీ ప్రేయసి కనిపిస్తే మాత్రం నాకు కబురంపు. ఫోటోలో ఉన్న అందాన్ని నిజంగా చూడొచ్చు.

సుభద్రమ్మ మేడదిగి వచ్చింది.

'శేఖర్ ఇంకా వెళ్ళలేదట్రా ! .... ఇవే శతనికి గోడకుర్చీ తప్పదు. ఓనాడు నిన్నుకూడా దులిపివేస్తుంది చూడు.'

'వస్తానయ్యా రఘుశ్రీ ! .... అన్నట్టు ఓ సంగతి మర్చిపోయాను. రేపు నేను ఇంటిదగ్గ రుండను. కనుక నువ్వు రావద్దు. మరోనాడు రావచ్చు.'

*   •   •

మనసులో వాన కురిసి వెలిసింది. మబ్బులు మళ్లీ అలుముకుంటున్నాయి. చీకటి దండెత్తి వస్తోంది. కన్ను పొడుచుకున్నా వెలుతురు కనపడదు. సత్యం వాంఛనీయమైనదే! .... కాని భయంకర సత్యాన్ని మానవుడు భరించలేడు. నిప్పులో స్నానం చేయటం, సముద్రపు టడుగున జలజంతువులతో పోరాటం, ఆకాశంలో నడవటం.

శేఖర్ నవ్వుకున్నాడు.

ఈ ఉపమానాల కర్థం ఏమిటి ?

నెమ్మదిగా అడుగులు వేస్తున్నాడు. గంటస్తంభం నిటారుగా నిలబడి 'తొమ్మిది' అంది. పార్కులో ఎవరూ లేరు. పువ్వులన్నీ నిశ్శబ్దంగా నిట్టూర్చి నిద్ర కుపక్రమిస్తున్నాయి. సిమెంటు బల్లమీద కూర్చుని ఆలోచించాడు.

నెలరోజుల క్రితం జరిగిన 'వివాహ మహోత్సవం' కంటి కెదురైంది. భయంతో-సిగ్గుతో-చిరునవ్వుతో అమాయకంగా తల వంచుకుని నిలబడ్డ రాధ సౌందర్యం—మత్తెక్కించే మల్లెపూల పరిమళం రూపం ధరించి సింగారించుకు వచ్చినట్టు—పురోహితుల అర్థంకాని 'పవిత్ర' మంత్రోచ్చారణలు, పట్టుబట్టల గరగరలు, నవ్వులు, కేరింతలు, ఎక్కడ చూసినా ఆనందం వళ్ళు మరిచి నృత్యం చేసింది .... అతని నూతన జీవితానికి నాందీ వాక్యం .... ఆమె మృదు హస్తాన్ని మొదటిసారిగా స్పృశించినప్పుడు కలిగిన పులకరింపు .... కాని ....

అందులో కల్మషం ఉందని అతనికేం తెలుసు ?

రాధ తనదికాదు.

శేఖర్ ఉలిక్కిపడ్డాడు. అదే వాక్యాన్ని ఎవరో పదేపదే అన్నారు.

అవును .... రాధ తనదికాదు. ఆమెకు గతం ఉంది. ఆ నాడు మల్లెపూలు పెట్టుకుంది. ఇప్పుడు గులాబీలు కావాలంటోంది.

ఈ సమస్యను పరిష్కరించే దెలా ? ....

'గతాన్ని మరచి హాయిగా ఉండు. మనిషన్న తరువాత తప్పుచేయకుండా ఉండరు. క్షమించి ఆదరించటంలో గొప్పతనం ఉంది.'

ఆత్మ బోధించింది.

మర్చిపోదా మనుకుంటే, రెట్టింపు బలంతో ఎదిరిస్తుంది. రఘు వర్ణించిన దృశ్యాలు సజీవంగా కనపడి మనసును ముక్కలు ముక్కలుగా కోసివేస్తాయి. రాధతోబాటు ఆమె గత జీవితం—రఘు కనిపిస్తారు .... ఆమెను ఏలుకోటం ఎన్నడూ జరుగదు. అది సాధ్యపడని పరిష్కారం.

పోనీ, ఆమెను చంపేస్తే ?

ఆమెతోబాటు అవినీతి, మోసం, దగా అన్నీ నశిస్తాయి. మున్ముందు అందరికీ ఇదొక గుణపాఠం అవుతుంది. సమాజంలో నీతి నియమాలు నెలకొల్పిన కీర్తి తనకు దొరుకుతుంది. నిజాన్ని నీడచేసిన ఆమె కిది తగిన శిక్ష.

శేఖర్ వెర్రిగా నవ్వుకున్నాడు.

అందాన్నెవరు హత్యచేయగలరు ? అది ఏనాడో అమృతం తాగి వచ్చింది. దానికి అంతమంటూ లేదు. యుగ యుగాలుగా అందర్నీ ఆకర్షించి, పిచ్చెత్తించి, చివరకు వూబిలోకి తోసేస్తుంది. ఒక్క రాధను చంపేస్తే ప్రపంచంలో అవినీతి ఉండదనుకోటం ఎంత పొరపాటు ! .... అదేంకాదు.

రాధ, రఘు ఒకర్నొకరు ప్రేమించుకొన్నారు. కొంత కాలం కలిసి ఉన్నారు. తెలియక తను అడ్డంవచ్చాడు. ఆమె కోసం రఘు ప్రతిరోజూ ఎదురుచూస్తూనే ఉన్నాడు. తను రంగంలోంచి తప్పుకోవాలి .... ఇద్దర్నీ కలిసి ఉండమనాలి మళ్లీ. మొదట్లో సంఘం ఒప్పుకోదు. క్లబ్బుల్లో, సినిమా హాల్లో, పార్కుల్లో ప్రతిచోటా రఘు గురించే అందరూ మాట్లాడుకుంటారు. ముక్కు చీదుతారు. గాలిలో అస్త్రాలు వదిలి వింత చూస్తారు. చివరకు విసుగెత్తి 'ఇలా ఉండేకన్నా, పెళ్లి చేసుకుంటే ఎంత మర్యాదగా ఉంటుంది!' అంటారు ... తనక్కావలసింది అదే! రఘు రాధను పెళ్లి చేసుకోవాలి.

శేఖర్ పార్కు వదిలి నడక సాగించాడు. గంటస్తంభం 'పది' అంది.

ఇప్పు డతను ప్రశాంతంగా ఉన్నాడు. ఎడారిలో తిరిగి తిరిగి 'ఒయాసిస్సు' దొరికినట్టయింది.

రాధ అరుగుమీద నిలబడుంది.

దీపం వెలుగులో ఆమె ముఖం స్పష్టంగా కనిపించింది.

తలనిండా తట్టెడు మల్లెపూలు—నిరీక్షించి అలసి సొలసిన కళ్లు—ఎర్రగా ఉండి నిట్టూర్పుతో పాలిపోతున్న చెక్కిళ్లు—

పాపం ! ఎంతసేపట్నుంచీ తనకోసం ఎదురుచూస్తోందో!

'అబ్బ ! .... వచ్చారూ ! .... ఎంతసేపట్నుంచీ మీకోసం ఎదురుచూస్తున్నాను ! మీ స్నేహితుడికి మంచి చెడ్డలు బొత్తిగా తెలియవనుకుంటా.' అంది కోపాన్ని అణచుకుంటూ రాధ.

'అవును రాధా ! .... అతను మన జీవితాలలో శాశ్వతంగా పెనవేసుకున్నాడు. విదలించి లాభంలేదు .... తాచుపాము చుట్టుకుంటే విదలించటం ఎలా ? కళ్లు మూసుకుని జరిగేదేదో జరుగుతుందని వూరుకోటం మంచిది.'

రాధ అతనికేసి ఆశ్చర్యంగా చూసింది. శేఖర్ మాటల్లో చూపుల్లో కొత్తదనం కనిపించింది.

'అమ్మ బాబోయ్ ! మీ రఘు తాచుపామైతే దయవుంచి అతనికి దూరంగా ఉండండి.'

శేఖర్ ముఖం కడుక్కుని వచ్చాడు. రాధ కాఫీ తీసుకొచ్చింది.

'సాయంత్రం మబ్బులు కమ్ముకున్నాయి. వాన కురుస్తుందని, మీరు తడుస్తారని భయపడ్డాను' అంది పక్కన నిలబడి.

'అవును. నేనూ అలాగే అనుకున్నా. కాని మబ్బులు చెదిరిపోయి ఆకాశం నిర్మలమైంది. చందమామ నవ్వాడు. నక్షత్రాలు కిలకిల నవ్వాయి.'

'మీ మాటలు చిత్రంగా ఉన్నాయండి .... నా కెందుకో భయంగాఉంది కూడా .... ముందు కాఫీ తాగండి .... తరువాత అన్నానికి రండి.'

'ఆకలి లేదు ....' అన్న మాటలు నాలిక చివరిదాకా వచ్చి ఆగిపోయాయి. రాధ నమ్మదు. సందేహిస్తుంది .... తన బాధ ఆమెకు తెలియకూడదు.

టేబిలుమీదున్న రాధ ఫోటో కనపడింది.

రఘు దగ్గరున్న అదే ఫోటో ! రెంటికి తేడాలేదు. అదే నవ్వు ! అదే ఆకర్షణ !

'మీరు మాత్రం 'రఘు—రఘు' అని కలవరిస్తారు కాని ఒక్కనాడైనా అతను మనింటికి రాలేదు.'

శేఖర్ నవ్వాడు.

'వస్తాడు .... ఒకసారి కాదు .... వందసార్లు .... శాశ్వతంగా ఇక్కడే ఉండిపొమ్మందాం. లేక మనమే అక్కడకు వెడదాం.'

రాధ ఫక్కున నవ్వింది.

ఆ రాత్రి అన్నీ పీడకలలు.

అర్ధరాత్రి హఠాత్తుగా మేల్కొని రాధకేసి చూశాడు—తృప్తిగా నిద్రపోతోంది. ఈ రాధేనా రఘును వరించింది ? అంతటి సాహసం ఆమె కెక్కణ్నుంచి వచ్చింది ? శేఖర్ నమ్మలేకపోయాడు ...... ఒకవేళ రఘు చెప్పిన కథ కల్పనేమో ! .... ఛ .... ఛ .... అదే నిజమైతే రాధఫోటో అతని కెలా దొరికింది ? ఏమైనా రాధ తనదికాదు.

శేఖర్ దూరంగా జరిగిపోయాడు.

తుఫాను ఎక్కువకాలం వీస్తే ప్రమాదం. అందుకని వినాశం తరువాత శాంతిస్తుంది. అలాగే అతని మనసు కుదుటపడింది. అతనిక్కావలసింది రాధ సుఖంగా ఉండటం. అంతే. మర్నాడంతా ఉత్సాహంగా కనిపించాడు. ఆదివారం కావటం మూలాన కాలేజీకి సెలవు.

ఇంటో పిండివంటలతో భోజనం, సాయంత్రం రాధతో షికారు, ఆమెకు ఇష్టమైన చీరెలు, రవికెగుడ్డలు కొన్నాడు. ఇద్దరూ ఇల్లు చేరుకునేసరికి ఏడైంది.

'అబ్బ ! .... ఈరోజు ఏనాటికీ మరపురాదు' అన్నాడు.

రాధ నవ్వి వూరుకుంది.

రాత్రి తొమ్మిది గంటలకు బట్టలు వేసుకుని బయటికి వెళ్లబోతున్న భర్తకు 'ఎక్కడికి ? .... ఆ రఘు ఇంటికేనా ? .... అబ్బబ్బ ! ఇతనెక్కడ దొరికాడండి మనకు ? ..... అత నీవూరువిడిచి ఎక్కడికైనా పోతే బాగుండును. పోనీ మనమేనా పోదాం. ఈ రాత్రి పన్నెండుదాకా రారు' అని అడ్డపడింది.

'రఘును ఏమీ అనకు. అతని స్వభావం మీకు తెలియదు .... ఈరోజు నువ్వు నాకోసం ఎదురుచూడకు అనవసరంగా' అన్నాడు నవ్వుతూ.

'అంటే త్వరగా వచ్చేస్తారు కదూ ?' అంది సమాధానపడిన కంఠంతో.

శేఖర్ త్వర త్వరగా వెళ్లిపోయాడు.

* * *

చిక్కటి నిశ్శబ్దం ! పట్టుబట్టలా వెన్నెల తళతళమంటోంది.

రఘు సిగరెట్టుమీద సిగరెట్టు కాలుస్తూ, ఏదో ఆలోచిస్తూ కూర్చున్నాడు. గడియారం ఒంటిగంట కొట్టింది.

ఎవరో తలుపు తట్టారు.

రఘు పరధ్యానంగా వూరుకున్నాడు. మళ్లీ తట్టేసరికి తలుపు తీశాడు. ఎదురుగా రాధ నిలబడుంది.

రఘు గుండె ఆగినవాడిలా చూశాడు. ఆశ్చర్యంతో నోట మాట రాలేదు. వర్తమానానికి దూరమైపోయాడు.

'మాలతి ! .... ' అన్నాడు పిచ్చివాడిలా.

రాధ భయంతో చూసింది.

'మాలతి ! .... నువ్వేనా ? ఎప్పుడు వచ్చావ్ ? ఇన్నాళ్లూ ఎక్కడున్నావ్ ?' రెండడుగులు ముందుకు వేశాడు.

రాధ వెనక్కి కదలింది. ఈ మారు గదిలో వెలుతురు ఆమె ముఖంమీదకు పూర్తిగా పాకింది. రఘు పొరపాటు పడేందు కవకాశం లేదు.

'మాట్లాడవేం మాలతి ? .... నామీద కోపమా ? .... అవునుమరి. కోపంలేకుండా ఉంటుందా ? నేను చేసిన పనికి ఏ శిక్షకైనా తగుదును. రా లోపలికి !'

'ఇది రఘునాథరావుగారి ఇల్లేనాండి ?' అనడిగింది రాధ.

'అవును .... అంత పొడుగాటి పేరుతో ఎందుకు పిలుస్తావ్ ? .... ఎప్పటికిమల్లే 'రఘు' అంటే చాలదా ?'

'మీరు పొరబడుతున్నారు. నేను ఇంగ్లీషు లెక్చరరు శేఖర్‌గారి భార్యను. నాపేరు రాధ—మాలతిని కాను.'

రఘు రాధను చూడటం ఇదే మొదటిసారి.

అతను కింది పెదవిని కొరుక్కుని గడచిన వాతావరణం లోంచి బయటపడ్డాడు.

'అలాగా ! .... పొరపాటున ఏదో అనేశాను. లోపలకు రండి .... ఈ అర్ధరాత్రిపూట వచ్చారు. ఏమైంది ?'

రాధ లోపలకు వచ్చింది. గదిలో సంభాషణ విని మేడమీద నుండి సుభద్రమ్మ కిందకు దిగివచ్చింది.

'ఆయన .... ఆయన .... రాత్రి తొమ్మిది గంటలకు మీ దగ్గరకు వస్తున్నానని బయలుదేరారు. ఇంతవరకూ రాలేదు .... ఇక్కడకు రాలేదాండి ?

పొంగివస్తున్న శోకాన్ని బలవంతాన అణచుకోటానికి యత్నిస్తోంది. రఘు నవ్వాడు.

'అలాగాండి ! .... అతని తత్వమే అంత. ఎవరైనా రెండో ఆట సినిమాకు లాక్కుపోయుంటారు. పెళ్లాం ఏమంటుందో, ఎలా బాధపడుతుందో అర్థంకాదు. మీరు కంగారు పడకండి. ఉదయానికల్లా వచ్చేస్తాడు.'

రాధ నవ్వబోయింది. 'అయ్యో ! చీకటిని వెలుగనుకోమంటారా ?' అన్నట్టు చూసింది.

'ఈ అర్ధరాత్రి ధైర్యంగా ఎలా వచ్చావమ్మా ?' అని ఆశ్చర్యపోయింది సుభద్రమ్మ.

రాధ ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేదు.

'నేను వస్తానండి .... ఆయన తిరిగివచ్చి నేను కనిపించకపోతే కోపగించుకుంటారు.'

రఘు తల్లికేదో సైగ చేశాడు.

'ఆ కోపతాపాలు తెల్లవారేసరికి చల్లబడతాయిలే ! .... రెండు దాటాక ఇంకేం వస్తాడు ? హాయిగా ఎక్కడో నిద్రపోతూ ఉంటాడు. రేపు గోడకుర్చీ వేయించి దండించు. ఈ రాత్రి కిక్కడ ఉండిపో. ఒంటరిగా తిరిగి వెళ్లకూడదు. నీకేం భయంలేదు. నే నున్నాను. మా అమ్మనుకో.'

రాధను మాట్లాడనీయక చరచర మేడమీదకు తీసుకుపోయింది.

రఘు ముఖంలో అంతవరకూ కనిపించిన ధైర్యం, చిరునవ్వు అంతరించాయి. కిటికీ దగ్గర కూర్చుని 'టేబిల్‌లాంప్' ఆన్‌చేశాడు. పేపర్ వెయిట్ అడుగున రెపరెప లాడుతున్న ఉత్తరాన్ని మూడోసారి చదవ నారంభించాడు.

ప్రియమైన రఘు—

నీ గుండెనిండా ప్రేమను నింపుకుని ఈ ఉత్తరం చదువు. అప్పుడు కోపతాపాలకు స్థానం ఉండదు.

'నిన్న కనిపించిన శేఖర్ ఈనాడు ఉత్తరం రాస్తున్నాడే' మని ఆశ్చర్యపోవుకదూ ? .... నేరుగా చెప్పే ధైర్యంలేక ఇలా చేస్తున్నా ననుకోకు. పరోక్షంగా రాసి సాధించే ఫలితం ఎక్కువ ఉంది కనక—

నువ్వింకా రాధను చూడలేదు. రేపు తెల్లవారేలోగా ఆమెను తప్పకుండా చూస్తావు. లేక ఆమె నీ దగ్గరకు వస్తుంది. వట్టి అమాయకురాలు. సూది నేలమీద పడిన చప్పుడు విని అదిరిపోతుంది. సున్నితమైన మనసు—ఒక్క నెలలో ఆమెను పూర్తిగా అర్థం చేసుకున్నానని కాదు. నేను ఉదహరించిన నిజాలు మాత్రం వూహలోంచి జనించినవి కావు. పాపం ! నన్ను చేసుకున్నందుకు ఎంతగా పరితపిస్తోందో !

నిన్న ఉదయమే నిజం బయటపడింది. అనుమానంగా ఉన్నా ఇన్నాళ్లూ అశ్రద్ధ చేశాను. డాక్టరు పూర్తిగా పరీక్ష చేశాడు. ఎక్స్‌రే తీశాడు. ఒక రిద్దరికి చూపించి రుజువు చేసుకున్నాక రెండు పొడి అక్షరాల జబ్బును వెల్లడించాడు.

'టి. బి' అని. మందులు, టానిక్కులు, ఇంజక్షన్లు, ఆరుబయట గాలిలో ఆకాశంకేసి చూస్తూ విశ్రాంతి తీసుకోటం. ఇవన్నీ నయం కావటానికి మార్గాలట ! నేను నమ్మలేదు. నమ్మను. ఊపిరితిత్తుల రంధ్రాన్ని ఎవరు మూయగలరు ?

ఈ రహస్యాన్ని ఎంతకాలం దాచగలను ? రాధ క్రొత్తగా వికసించిన పువ్వు. పువ్వు అందాన్ని దూరంనుండి చూసి ఆనందించాలి. అంతగా ఆత్మనిగ్రహం లేకపోతే మృదువుగా తాకి స్పర్శకు సంతోషపడాలి. అంతేకాని విషవాయు ప్రయోగం ద్రావకం కుమ్మరించటం, ఇవన్నీ అందాన్ని చిత్రవధ చేస్తాయి. రాధ క్రొత్త-ఇంకా ఎవరికీ హృదయార్పణ చేసుకోలేదు. భర్తంటే ఏమిటో, ఎవరో తెలియని స్థితిలో ఉంది. కనుక, ఇపుడే ఆమెను సరైన మార్గంలో పెట్టాలనే నిర్ణయంతో దారిలోంచి తప్పుకుంటున్నా. ఓ క్రొత్త ప్రపంచం ఆమెకోసం ఎదురుచూస్తోంది.

ఇదంతా ఎందుకు రాస్తున్నాననీ ఆశ్చర్యపోతున్నావు కదూ ! మనిషికి తన శక్తి తెలియదంటారు. అలాగే నువ్వూను. రాధకు వెలుగు ఎవరు చూపిస్తారు ? .... అప్పుడే కంగారు పడుతున్నావుకదూ ? .... అవును. ఆ కాగడా పట్టే బాధ్యత నీకు వదిలేస్తున్నా. మన చిరకాల స్నేహితానికిది పరీక్ష. రాధ అమాయకురాలైనా, గడుసరి ! ఆమెవెంట నువ్వు ఎప్పుడూ ఉండక్కర్లేదు. 'అదుగో ! ఆ తోవంట వెళ్లు' అని చూపిస్తే చాలు. ఆమె నడచిపోతుంది. క్రమంగా తెలుపు నలుపులు తెలుసుకుంటుంది. ఆమెను సరిదిద్దుతావనే విశ్వాసం నా కుంది.

ఇంక, నే నెక్కడి కెడుతున్నానని ఆలోచిస్తున్నావు కదూ ? .... నా గురించి ఎవరూ బాధపడకూడదు. ప్రస్తుతం బొంబాయి వెడుతున్నా. అక్కడ 'టి. బి' శానిటోరియం ఉందట. చికిత్స ఆధునిక పద్ధతులమీద నడుస్తుంది. వైద్య శాస్త్రం అక్కడ శిఖరాన్ని అందుకుంది...... సెలవు ....'

రఘు గట్టిగా నిట్టూర్చాడు. సాయంత్రం శేఖర్ ఇంటిదగ్గరుండే వో కుర్రాడు ఈ ఉత్తరం ఇచ్చిపోయాడు. అశ్రద్ధతో తను పదింటిదాకా చదవలేదు. రాధ వస్తుందని అతనికి తెలుసు.

మేడమీద అమ్మ రాధను సముదాయిస్తోంది.

*   *   *   *

మర్నాడుదయం రాధ తన ఇంటికి బయులుదేరింది.

'అరగంట క్రితం నేను చూసివచ్చాను. శేఖర్ ఇంకా తిరిగి రాలేదు. మీ రలా కూర్చోండి. ఒకటి రెండు సంగతులు మాట్లాడవలసుంది.'

'మీకంటె వయస్సులో చిన్నదాన్ని. నన్ను 'అండి' అని గౌరవించ నక్కర్లేదు.' అంది రాధ.

'మరోలా అనుకోక నే నడిగే ప్రశ్నలకు జవాబివ్వాలి. నీకు బంధువు లెవరూ లేరా ? తలిదండ్రులు లేరని శేఖర్ చెప్పాడు. ఆ ధైర్యంమీద అడుగుతున్నా.'

'మావయ్య మద్రాసులో ఉన్నాడు. పెళ్లవటంతో బంధుత్వం తెగినట్టే ! అతనికి నేనొక భారంగా ఉంటూ వచ్చాను.'

రఘు విషయం ఎలా వ్యక్తం చేయాలో తెలియక తికమక లాడాడు.

'ఏమిటో ! .... బంధువులు ! ప్రపంచం ! అన్నీ తమాషాగా కనిపిస్తాయి నాకు. అకారణంగా మనస్పర్థలు. ఒకరికి మరొకరు దూరం కావటం. మనసులో ఒకటి, పైకి మరొకటి. లోలోన కుమిలిపోతూ పైకి నవ్వటం. నిజం చెప్తున్నా రాధా ! .... జీవితంమీద నాకు గొప్ప అభిప్రాయమేమీ లేదు.' సిగరెట్టు పొగలోంచి ఏదో వూహాలోకాన్ని చూస్తూ అన్నాడు.

కాని రాధతో నిజాన్నెలా చెప్పటం ? స్టీవెన్‌సన్ నిజం చెప్పటం కష్టమన్నాడు. అందరూ 'నిజమే చెప్పాలి. సత్యమే జయం !' అంటారు. కాని నిజం నిప్పులాంటిది. ఎంతో జాగ్రత్తగా—మానవుడు ఏళ్ల తరబడి కష్టపడి సృష్టించిన భాషలో చక్కగా మాటలు ఏరి కూర్చి అభిప్రాయాన్ని వ్యక్తం చేసినా, ఎక్కడో, సూది మొనంత వెలితి కనిపించి అబద్ధమై వూరుకుంటుంది. 'శేఖర్ వెళ్లిపోయాడు' అని ఆమె ఆవేదనకు జవాబు చెప్పవచ్చు. ఆ రెండు మాటలు రెండు సముద్రాలై ఆమెను ముంచివేస్తాయి. సమాధానం కోసం ఎదురుచూస్తున్న ఆమెకేసి చూడలేకపోయాడు. ఆరోగ్యంగా, ఉత్సాహంగా నవ్వుతూఉండే శేఖర్‌కు 'టి. బి' వచ్చిందంటే ఆమె నమ్ముతుందా ? విరగబడి నవ్వుతుంది. ఇంతటి విజ్ఞానం, చదువు, సంస్కారం ఉండి కూడా ఈ అసందర్భత్వాన్ని ఎలా నమ్ముతున్నారని నిలదీసి అడుగుతుంది. అలా అర్థంలేకుండా పెద్దగా నవ్వుతుంది..... అంతే ! మతి చలించిందంటారు. లేదా ఆ నవ్వుతోనే ఆగిపోతుంది. అధ్యాయం ముగిసిందంటారు.

'నాకు తెలుసు—ఇంటికి త్వరగా వెళ్లా లనుకుంటున్నావు. అక్కడ శేఖర్ కనిపించకపోతే నా మాటలు గుర్తొస్తాయి. నూటికి నూరు వంతులు మంచిగా ఉండే మనుష్యులుండరు .... ఈ కల్మషాన్ని ఎందుకు ప్రేమించాలని అన్వేషిస్తూ బతకలేం కూడా. మనకున్న వెగటును బాహాటంగా ప్రదర్శించలేం. అందుచేత వైరాగ్యాన్ని మనసులో దాచుకుని పైకి నవ్వుతూ కలివిడిగా ఉండాలి. ఏదో సాధించాలని శ్రమపడేకంటే, దొరికిన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోటం మంచిది. ఏమంటావ్ ?'

'ఇంతకూ ఈ ఉపోద్ఘాతం దేనికి ?' అనడిగింది రాధ.

'ఇపుడు నేను చెప్పబోయే వార్త విని నువ్వు కంగారు పడకూడదు. ధైర్యంగా, తెలివిగా గడిచిన రోజులు మర్చిపోగలిగితే గమ్యస్థానం చేరుకోవచ్చు .... శేఖర్ ప్రస్తుతం రైల్లో ప్రయాణం చేస్తూవుంటాడు.'

రాధ ఒక్కడుగు వెనక్కి వేసింది. ఏదో వైపరీత్యం జరిగిందని తెలిసినా దాని రూపం ఇంకా తెలియదుగా !

'పూర్తిగా విను రాధా ! .... అతను బొంబాయి వెడుతున్నాడు.'

రఘు ఆగాడు.

'ఎందుకు ? .... '

'అతని కేదో గుండెజబ్బు ఉందని డాక్టర్లు నిర్ణయించారట. చికిత్సకోసం వెడుతున్నాడు.'

రాధ కుప్పలా కూలిపోయింది. సుభద్రమ్మ ఆమెను కావలించుకుని పట్టుకుంది.

'ఆ గుండెజబ్బు టి. బి. యేనా ?'

అఘాతంలోంచి మాటలు వెలువడ్డాయి.

రఘు సమాధానం చెప్పలేదు.

* * *

రెండు రోజులు గడిచాయి.

సుభద్రమ్మ ఇరవైనాలుగు గంటలూ రాధ వెంట ఉంటూ వచ్చింది. రఘు కనిపించటంమానేశాడు. మన స్తత్వం పూర్తిగా అర్థం చేసుకున్నాక కాని ప్రయోగాలు చేయకూడదు. తల్లి ద్వారా ఆమె ప్రవర్తన కనుక్కుంటూ ఉన్నాడు.

ఆ సాయంత్రం రఘు ఆఫీసునుండి వచ్చేసరికి రాధ ఎక్కడికో బయలుదేరుతూవుంది.

'ఎక్కడికి బయలుదేరావ్ రాధా ?' అనడిగాడు.

'ఫలానా చోటికని చెప్పలేను. ఈ రాత్రి బండికి మా మావయ్య దగ్గరకు వెడతాను. అతను ఏం సలహా చెప్తాడో చూస్తాను. నన్ను చదివించి, పెళ్లి చేసింది అతనే కనక ఈ బాధ్యత కూడా అతనిదే !'

రఘు ఆమెను పరీక్షగా చూశాడు.

'అబద్ధం ! .... అంతా కల్పన !'

రాధ ఉలిక్కిపడింది.

'నీ మనస్సులో ఉన్నది నాకు తెలుసు. నన్ను మాత్రం ఏనాడూ మోసం చేయలేవు. తిన్నగా ఇంటికి వెళ్లి ప్రాణాలు తీసేసుకుందా మనుకుంటున్నావు ! అవునా ?'

రాధ సమాధానం చెప్పకుండా చేతులొత్తి మొహం కప్పుకుని వెక్కివెక్కి ఏడ్చింది.

'నిజంగానా అమ్మాయ్ ? .... ! ఛీ నువ్వింత పిరికి పందవని తెలిస్తే నిన్ను దూరంగా ఉంచేదాన్ని. జీవించటంలో గొప్పతనం లేదా ? ఈ రెండు రోజులు నీతోవుండి, తెలివైన దాని వనుకున్నాను. ఇంతేనన్నమాట !' అంది సుభద్రమ్మ.

'ఇంతకంటే వేరే మార్గం కనిపించటంలేదా నీకు ? ... శేఖర్ రాసిన ఈ ఉత్తరం చదివిచూడు' అని ఉత్తరం అందించాడు రఘు. రాధ చదివింది.

'మరి నన్నేం చేయమంటారు ?'

'మావయ్య దగ్గరకే వెళ్ళు. చూడగానే ఆప్యాయంగా రమ్మంటాడు. సంగతంతా విని మొహం చిట్లిస్తాడు. ఇంటో పనిమనిషిగా ఉండమంటాడు. పోనీ, అతను మంచివాడనే అనుకుందాం. ఇంట్లో కూర్చోబెట్టి తిండి బెడతాడు. మంచి మంచి సిల్కు బట్టలు కొనిస్తాడు. సినిమాలకు వెళ్ల మంటాడు.... అంతమాత్రంచేత నీ మనసు తృప్తిపడుతుందా ? స్త్రీలందరికీ దొరికే సంసార సౌఖ్యం నీకు దొరకలేదు. దావాగ్నిలాంటి మంట నీలో రేగుతోంది. దాన్ని ఆర్పటానికి అందరికిమల్లే జీవిస్తే చాలదు ....'

రాధ ఏడుపుమాని కళ్లు తుడుచుకుంది.

అతని మాటల్లో ఏదో ఆశాభావం, ఆకర్షణ కనిపించాయి. రెండు రోజులుగా మెదలిన ఆత్మహత్యా నిర్ణయం దూరమైంది.

'నన్నేం చేయమంటారో చెప్పండి.' అంది మళ్లీ.

'నా కొక్కటే మార్గం కనిపిస్తోంది. నువ్వు స్కూలు ఫైనలు ఫస్టుక్లాసులో ప్యాసయ్యావు. శేఖర్ చెప్పాడు నాకు. కాలేజీలో చేరి చదువు .... నీ కిష్టమైన కోర్సు తీసుకో. ఇంటరు పూర్తయ్యాక మెడిసిన్ చదవవచ్చు.'

'అవునమ్మాయ్ ! అదే మంచిది ! నువ్విక్కడే ఉండి చదువుకోటంలో మా కెలాంటి అభ్యంతరమూ లేదు. ఆయన పది తరాలకు సరిపడే ఆస్తి గడించి మాకు వదిలిపోయారు... బతికిఉంటే వాడి చెల్లెలు సరిగ్గా నీ యీడుదే ! మా కా అదృష్టంలేదు.' అంది సుభద్రమ్మ.

'నీ కిక్కడ ఉండటం కష్టంగా ఉంటే హాస్టల్లో చేర్పిస్తాను.'

రాధ కొంతసేపు మౌనంగా ఉంది.

' .... నాకు ఒక్కటే భయం. ఆయన స్నేహితులకూ, కొందరు విద్యార్థులకూ నన్ను బాగా తెలుసు. అలాంటప్పుడు ఈ వూళ్లో ఎలా చదవగలను !'

రఘు ఆ ప్రశ్నకు సమాధానం చెప్పలేకపోయాడు. రాధ మేడమీదికి వెళ్లిపోయింది.

'లోకులు .... ' అంది సుభద్రమ్మ ఏదో ఆలోచిస్తూ.

'కాకులు .... అపవాదం తప్పదు. అయినా ఎదిరించి నిలబడాలి. శేఖర్ కోర్కెను మన్నించితీరాలి.'

సుభద్రమ్మ కొడుకుకేసి గర్వంగా చూసి 'చంద్రుడిలో కూడా మచ్చ ఉంటుంది' అనుకుంది.

సమస్యలు అనుకోకుండా ఎలా అల్లుకుంటాయో, అలాగే అప్రయత్నంగా విడిపోతాయి. రాధ వేసిన ప్రశ్నకు జవాబు ఆ సాయంత్రం దొరికింది. రఘు కాకినాడకు బదిలీ అయ్యాడు. మూడు రోజుల్లో వచ్చి జాయిన్ కమ్మని ఉత్తరువు.

సుభద్రమ్మ ఈ వార్త విని 'ఏవిట్రా ! నీక్కూడా ఈ వూళ్లు మారే ఉద్యోగమేనా ? భూప్రదక్షిణం చేసే యోగం ఉందేమో మనకు !' అని విసుక్కుంది.

'నేను ఈ రాత్రి బండికే వెడుతున్నా. ఇల్లు, అదీ కుదర్చాలి. వారం రోజులు పోయాక మీరు రావచ్చు. శేఖర్ యిల్లు యజమానికి వప్పగించేశాను. అక్కడవున్న సామాన్లు, ఫర్నిచరు అన్నీ మనతోబాటు తీసుకుపోదాం ..... ఈ లోగా రాధను కాలేజీలో చేర్పించేందు క్కావలసిన ఏర్పాట్లన్నీ చేస్తాను.' అన్నాడు రఘు.

సుభద్రమ్మ అంగీకారసూచకంగా తల వూపింది.

దుఃఖం వస్తే ఏడుస్తాం. సంతోషం కలిగితే మైమరచిపోతాం. భయం ఆవరిస్తే గజగజ వణికిపోతాం. కాని ఈ అనుభూతులన్నీ ఏకకాలంలో చుట్టుముడితే ఏరకమైన చలనమూ కలగదు. ఎవరైనా కదలిస్తే 'ఎందుకు ? ఎక్క

డకు ?' అని అడక్కుండా కదలిపోతాం. రాధ విషయం కూడా అంతే.

ఉన్నట్టుండి భర్త 'టి. బి.' వచ్చిందని బొంబాయి ఉడాయించాడు. అతను తిరిగి వస్తాడో లేదో తెలియదు. ఒక వేళ వచ్చినా అతని మనస్తత్వంలో ఎలాంటి మార్పులు వచ్చి ఉంటాయో ! .... తన్ను విడిచి వెళ్లటానికి ఏదో బలమైన కారణం ఉండితీరాలి .... 'టి. బి' వచ్చిందని తను నమ్మలేక పోతోంది. రోగం వచ్చిన వ్యక్తి 'నాకోసం కన్నీటిబొట్టు విడిచేవారు ఒక్కరైనా ఉండరా ?' అని ఎదురుచూస్తాడు. అంతేకాని ఉన్నవారికి దూరంగా పారిపోడు. అతని క్కావలసింది సానుభూతి. తనకోసం బాధపడేవా రున్నారన్న తృప్తి.... కాని శేఖర్ వాటికోసం వేచివుండలేదు .... అతను ఎప్పుడు తిరిగి వస్తాడో ! పది సంవత్సరాల తరువాత వస్తాడనుకుంటే, అంతవరకూ తను ఏం చేయటం ? రఘు అన్నట్టు వూరికే కూర్చోలేదుగా !

తల్లీ కొడుకులు తనమీద ఎందు కింత ఆప్యాయత కనబరుస్తున్నారో ఆమె కర్థం కాలేదు. శేఖర్ పట్ల ఉండే అనురాగాని కిది తార్కాణమా ? తను చదివితే వాళ్ల కొరిగే దేమిటి ?

తన చదువుకోసం రఘు బోలెడు డబ్బు ఖర్చు పెట్టాలి. అంతేకాదు. సంఘంలో అపవాదును ఎదుర్కోవాలి. తను రఘు ఇంటో ఉంటున్న సంగతి అందరికి తెలిసే ఉంటుంది. ఈ వార్త మావయ్యక్కూడా అందుతుంది. కాని చలించడు. 'తుభుక్కున' ఉమ్మేసి 'పీడ విరగడైంది' అంటాడు. అయినా, ఇదంతా తను ఓర్చుకోవాలి. ఎవరికోసం ? ఎందుకు? ఎండిన మొక్కను పుష్పించమనేందుకా ? ఎడారిలో నదిని ప్రవహింప జేసేందుకా ? మంచుకొండమీద మహలు నిర్మించేందుకా ? .... నైరాశ్యానికి వన్నె చిన్నెలు దిద్ది ప్రదర్శించేందుకా ?

ఆలోచించింది.

ఆమె కదొక్కటే పని. ఉదయం లేవగానే సుభద్రమ్మకు ఏదో సాయం చేయటం. వంటలక్క ఉన్నా ఇంటి పనులు చేయటం. తీరిక దొరికినప్పుడు ఈ చిత్ర జీవితం గురించి ఆలోచించటం. ఒక్కొక్కప్పుడు శేఖర్ ఎదురుగా నిలబడి క్షమించమని కోరినట్టు భ్రమ.

అలా వారం రోజులు గడిచిపోయాయి.

రాధ చదవటానికి నిశ్చయించుకుంది.

అనుకున్న ప్రకారం రఘు వచ్చి ఇద్దర్నీ కాకినాడ తీసుకుపోయాడు.

* * *

గాంధి నగరంలో రఘు అద్దెకు తీసుకున్న ఇల్లు చిన్నదైనా అందంగా ఉంది. ఇంటి చుట్టూ చిన్న కాంపౌండు. ఇంటో అడుగు పెట్టగానే పెద్ద హాలు. ఆ వెనుక రెండు గదులు. తరువాత వంటిల్లు. మేడమీద రెండు గదులు. మేడంతా రాధ అధీనంలోకి వచ్చింది.

గతాన్ని మరిచిపొమ్మని, భవిష్యత్తు గురించి జాగ్రత్త పడమని రఘు పదేపదే ఆమెను హెచ్చరించాడు.

కాకినాడ వచ్చిన మూడోనాడు రాధ ఇంటరులో చేరింది. రాధ తనకు వరుసకు చెల్లె లవుతుందని రఘు అందరితో చెప్పుకున్నాడు.

క్లాసులో మొత్తం నూట ఇరవైమంది విద్యార్థులు. పదిమంది విద్యార్థినులు. అమ్మాయిలు ఒకర్నొకరు పరిచయం చేసుకున్నారు. గంట గంటకు కొత్త కొత్త లెక్చరర్లు వచ్చి చదువు, పుస్తకాలు, క్రమశిక్షణల్ని గురించి బోధించారు. వినేవారు విన్నారు. లేనివారు కబుర్లలో పడ్డారు. కొందరు ఈలలు వేస్తే మరికొందరు మృదంగం వాయించారు. మొదటిరోజునే, ముఖ్యంగా తెలుగు మేష్టార్ని గడగడ లాడించారు.

రాధకంతా కొత్తగా ఉంది. క్లాసులో ఉన్నంతసేపు ఆమెకు శేఖర్ జ్ఞాపకమే లేదు. ఇంటికి తిరిగి వస్తుంటే ఆమె నెవరో పిలిచారు. వెనక్కి తిరిగి చూస్తే సరళ త్వర త్వరగా ఆమెను కలుసుకునేందుకు వస్తోంది.

'హమ్మయ్య ! .... పూపిరాడటంలేదు ! .... ఎన్నిసార్లు పిలిచానో తెలుసా ? పరధ్యానంగా ఉన్నట్టున్నావు.' అంది ఆమెను కలుసుకుని.

రాధ ఆశ్చర్యపోయింది. కొందరితో ఎంతకాలం కలిసి ఉన్నా స్నేహితం ఏర్పడదు. కొందర్ని చూడగానే చెలిమి చేయా లనిపిస్తుంది. సరళలో ఏదో ఆకర్షణ కనపడింది ఆమెకు. చేతులకు రెండేసి గాజులు, రాళ్ల దుద్దులు సూర్యరశ్మికి తళుక్కుమన్నాయి. ఆ వెలుగు కళ్లల్లో పరావర్తన చెందింది. ముచ్చటగా నున్నటి మెడ చుట్టూ ఒంటిపేట గొలుసు, నుదుటిమీద కుంకంబొట్టు మరీ పెద్దదిగా కనపడింది.

'కలవారి పిల్లయి ఉంటుంది' అనుకుంది రాధ.

'ఏమమ్మా రాధమ్మా ! .... అలా బెదరిపోతావెందుకు ? నేను సింహాన్నా ? పెద్దపులినా ? .... ఆడపిల్లల్ని చూసి ఇంతగా జడుసుకుంటున్నావు. మరి ఈ కాలేజీ అబ్బాయిల ముందు ఎలా నిలవగలవు ?'

'అబ్బే ! అలాంటిదేమీ లేదండి ! ఏదో ఆలోచిస్తూ పరధ్యానంగా ఉండటంవలన మీ పిలుపు అందలేదు.'

'నేనూ అంతే అనుకున్నా. ఇకముందు 'అండి' అని ఆకాశాని కెత్తి గౌరవించ నక్కర్లేదు. పేరెట్టి పిలుస్తేచాలు. తెలిసిందా ?'

'అలాగే ! .... తెలిసింది.'

'మీ ఇల్లెక్కడ ?'

'గాంధీనగరం –' వెనకాల వస్తున్న విద్యార్థుల గుంపును తిరిగిచూస్తూ అంది.

'భేష్ ! .... అందుకే మనిద్దరికీ మొదటి పరిచయం లోనే స్నేహితం కుదిరింది. నేనూ అక్కడే ఉంటున్నా.'

రాధ రిక్షా పిలవబోయింది.

'వద్దు .... వద్దు .... ఇలా హాయిగా నడచిపోదాం. కాళ్లు అరిగిపోవులే ! ఎందుకో, నీతో నాకు చాలా మాట్లాడా

లనిపిస్తోంది. నేను ఏదైనా అడిగితే అపార్థం చేసుకుని కోప గించుకోకు.'

సమాధానంగా రాధ నవ్వింది.

ఇద్దరూ కాలేజీ గురించి ఏవేవో మాట్లాడుకుంటూ నడుస్తున్నారు.

'కాలేజీ చదువు వట్టి దండుగ ! .... నేర్చుకునేదేమీ లేదు .... సరదాకి చదువుకోటం, కొత్త కొత్త అనుభవాలు కావాలంటే ఇంట్లో కూర్చుంటే వస్తాయా ? అందుకనే భిన్న మనస్తత్వాలున్న వ్యక్తులమధ్య కలివిడిగా తిరగాలి. కూపస్థమండూకంలా ఉండకూడదు.'

రాధ ఆశ్చర్యంతో ఆమెకేసి చూసింది. రఘు చెప్పిన నిజానికి, ఈమె మాటలకు బోలెడు వ్యత్యాసం కనపడింది.

కొంతసేపు ఇద్దరూ మౌనంగా నడిచారు.

'అన్నట్టు నీకు పెళ్లయిందా ?'

రాధ ఉలిక్కిపడింది. సరళ నిజం కనుక్కుందా ? .... లేక తెలుసుకునేందు కడుగుతోందా ?

'లేదే ! ... ఆ సందేహం నీ కెలా కలిగింది చెప్మా ?' అంది ఆశ్చర్యం నటిస్తూ. సరళ పకపక నవ్వింది.

'ఓసి వెర్రి రాధా ! .... అబద్ధ మాడినా నేర్పుగా ఉండాలి. పెట్టిన కోటలా ఉండాలి. శత్రువులు ప్రవేశించేందుకు వీ లుండకూడదు.... కాని దొరికిపోయావు. నీ మెళ్లో మంగళసూత్రం మా టేమిటి ?'

రాధ వెలవెలబోయింది. ఏ రహస్యాన్ని దాచి ఉంచాలని ఆమె శ్రమ పడిందో అది బయటపడింది. పరిస్థితి నెలా సరిదిద్దుకోవాలో ఆమెకు తెలియలేదు. సరళ ఆమెనే పరీక్షగా చూసింది.

'రాధా ! .... నువ్వు మనసులో ఏదో ఉంచుకొని బాధ పడుతున్నావు. నిజం నాతో చెప్పు. నేను నీ మంచి కోరేదాన్ని. అనుమానించకు.'

రాధ రెండు నిమిషాలు పూరుకుంది. సరళతో చెప్పి నందువల్ల వచ్చే ప్రమాదం కంటె చెప్పకుండా దాచివుండటం వలన కలిగే అనర్థం పెద్దది.

'నాకు పెళ్లయిన మాట నిజం .... కాని, ఆయ నిప్పుడు లేరు.'

'అంటే ?'

'అంతకంటే వివరించలేను. కొన్ని కారణాలచేత నన్ను వదలి వెళ్లిపోయారు. బొంబాయిలో ఉన్నారని వినికిడి.'

'తిరిగి రారంటావా ? ....'

'ఆ ప్రశ్న అడిగే అధికారం నీకేముంది ?' అని కసిరి కొడదా మనుకున్న రాధ ఆలోచనలో పడింది. అవును .... ఆ ప్రశ్నకు తనదగ్గర మాత్రం సమాధానం ఉందా ? .... శేఖర్ కూడా చెప్పలేదు. అభిప్రాయాలకు స్థిరత్వ మేర్పడిననాడు మానవుడు జీవితాని కతీతు డవుతాడు. అతనికోసం మరో లోకం, చట్టం, ఆశయం ఎదురుచూస్తూ ఉంటాయి. అలాంటి మరో లోకం లేదు. కనక—కనీసం చూసినవా రెవరూ లేరు కనక—అభిప్రాయాలకు స్థిరత్వం లేదనే అన కోవాలి.

'రాకపోవచ్చు ....' అంది చివరకు.

'ఏడుపు వస్తోంది కదూ ? .... నువ్వో వెర్రిబాగు ల్దానివి. కొన్ని నియమాలు, కట్టుబాట్లు, ఆచారాలు వివా హాన్ని సృష్టించాయి. అవన్నీ సవ్యంగా ఉన్నంతకాలం అందులో ఉండే పవిత్రతను గౌరవించాలి. — కాని కట్టుకున్న మగాడు అన్నింటిని కాలదన్ని వెళ్లిపోతే అది అపవిత్ర మైపో తుంది .... అప్పు డది కేవలం బంగారు ముక్క .... అదలా వుంచి నీకు పెళ్లయినట్టు మా కెవ్వరికీ తెలియదు. నేను కూడా మంగళసూత్రం చూసి కనుక్కున్నా. రేపు అందరూ చూస్తారు. నిన్ను వేలాది ప్రశ్నలు వేస్తారు. చరిత్రంతా పూసగుచ్చినట్టు వివరించాలి. విసుగెత్తి చెప్పటం మానేశా వనుకో. నీ పతనం మొదలన్నమాట. తలకిందులా తపస్సుచేసి పూర్తి వివరాలు కనుక్కుని ప్రచారం చేస్తారు .... కనక ఇక ముందైనా హాయిగా బతకాలనుంటే ఆ సూత్రాన్ని తీసి దాచేయి. కంటికి కనపడకుండా పెట్టె అడుగున పడేయి. వీలైనన్ని అబద్ధాలు చెప్పు. ఒకరికి హాని కలిగించనంతకాలం అబద్ధాలకోట కట్టవచ్చు. మరేం ఫరవాలేదు. ఆకాశంలో కాకిని గద్దన్నా వనుకో—తప్పులేదు. ఎందుకంటే ఎవరికీ నష్టంలేదు.'

రాధ సరళ మాటలు శ్రద్ధగా వింటోంది. సరళ రూపంలో ఆకర్షణ ఉన్నట్టు, మాటల తీరులో, సిద్ధాంతాల ప్రతిపాదనలో అయస్కాంతం ఉందని గ్రహించింది.

'అయితే సరళా ! .... నన్నేం చేయమంటావ్ !'

'ముందే చెప్పానుగా ! .... చక్కగా మంగళసూత్రం తీసి దాచేయి. మీ ఇంటోవాళ్లు ఒప్పుకోకపోతే, కష్టనష్టాలు వివరించి శాంతింపచేయాలి.'

రాధ ముఖంలో తొట్రుపాటు చూసి సరళ నవ్వింది.

'పిడుగుపడ్డట్టయింది కదూ ? నీవేకాదు. ఎవరికైనా అంతే ! స్త్రీల కది పవిత్రాతి పవిత్రమైన వస్తువు. కాదనను. కాని మగవారు దాని విలువను గుర్తించి గౌరవించనప్పుడు అది పెట్టె అడుగునే ఉండాలి. మీ ఆయన నిన్ను వదలిపో టానికి కారణం నీలో ఉన్న లోపమైతే, నీకు మంగళ సూత్రం ధరించే యోగ్యత లేదు. పొరపాటు అతనిదైతే దానికి విలువ లేదు. .... ఎలాగూ కొత్త జీవితం కావాలంటున్న దానివి ఈ గత స్మృతులతో ఎందుకు వేగటం ? నే నిలా అంటున్నానని కోపగించుకోకు. నువ్వే ఆలోచించి చూడు. నిజా నిజాలు తెలిసి వస్తాయి. అదుగో ! మా యిల్లు వచ్చేసింది. కాసేపు ఉండిపోదువు గాని, రా !'

'వద్దు సరళా ! .... మనసంతా చీకాగ్గా ఉంది. మరో నాడు చూసుకుందాం.'

'సరే ! .... ఇంటికివెళ్లి ఏడుస్తూ కూర్చోకు. ధైర్యంగా ఉండు.'

సరళ సందులోంచి కదిలి అదృశ్యమైంది.

రాధ త్వరత్వరగా నడిచింది.

*  *  *  *

ఆకలి లేదంటూ అన్నం తినకుండా పడుకుంది రాధ.

ఏడ్చి ఏడ్చి కళ్లు రెండూ ఎర్రసిరాపూసుకున్న ట్టయ్యాయి.

సరళ మాటలు చెవులదగ్గర పదే పదే వినిపిస్తున్నాయి. మంగళసూత్రం తీసేయమంది. ఏ హిందూస్త్రీ ఆపని చేయ గలదు ? శీతకాలంనాటి రాత్రి గులాబీమీద వర్షించే మంచు బిందువుకున్న స్వచ్ఛత దానికుంది. పవిత్ర మంత్రోచ్చారణలు, శ్రేయస్కాముల ఆశీస్సులు, శుభసూచకాలైన పరిమళ ద్రవ్యాల గుబాళింపు, వీటిమధ్య కట్టబడిన పుస్తెను దాచేయ మంటుంది సరళ. 'వీల్లేదు .... అలా నే నెన్నటికీ చేయను' అనుకుంది. రఘును, సుభద్రమ్మను అడిగితే బాగుండును. కాని వారు 'ససేమిరా' ఒప్పుకోరు. ఆ మాట వినగానే చెవులు మూసుకుని 'రామరామ!' అంటారు. అంతటితో ఆ ప్రయ త్నము మానుకోవాలి.... కాని అలా చేయకపోతే సరళన్నట్టు అందరూ అన్నీ అడుగుతారు. వోపిగ్గా సమాధానం చెప్పాలి. రఘు కూడా నవ్వులపా లౌతాడు.

వణుకుతున్న చేతులతో రాధ మంగళసూత్రం తీసి పెట్టె అడుగున భద్రపరచింది. అరగంట వరకూ ఆమె గుండెలు వేగంగా కొట్టుకుంటూ ఉన్నాయి.

ఆ మర్నాడు సరళ 'ఈమె కుమారి రాధ!' అంటూ అంద రికీ పరిచయం చేసింది.

పుస్తె తీసేయటం తల్లి కొడుకులు గమనించారో లేదో రాధకు తెలియదు. ఆ ప్రస్తావన ఎవరూ తీసుకురాలేదు.

ఉన్నట్టుండి రాధ చిత్రమైన వాతావరణంలో పడింది. మొదట్లో కంగారుపడ్డా, క్రమంగా మార్పులకు అలవాటు పడింది. కాలేజీ చదువు చిత్రమైన అనుభవం. సరళన్నట్టు చదువుకంటె ఆడంబరమే ఎక్కువ. వీలు చిక్కినప్పుడల్లా సరళ కొత్త కొత్త విషయాలు బయట పెట్టేది. కొంత మంది లెక్చరర్లు అందంగా ఉండే అమ్మాయిలమీద కన్ను వేసి ఉంచుతారని, జాగ్రత్తగా ఉండవలసిందని హెచ్చరిం చింది. అలాగే క్లాసులో వుండే అబ్బాయి లందరి గురించి చెప్పుకుపోయేది. 'వీళ్లందరి భోగట్టా ఈమె కెలా తెలి సింది చెప్మా ?' అని రాధ ఆశ్చర్యపోయేది..... మొత్తానికి ఓ చక్కటి పూలతోటలో ప్రవేశించినట్టయింది రాధకి. సౌందర్యగర్వంతో మైమరచిన మల్లెలు, సంపెంగలు, గులా బీలు—ఇంకా ఎన్నో వళ్ళువిరబోసుకున్నాయి. కనుల పండు వగా ఉన్నా, ఎక్కడో, ఏ మొక్క చాటునో విషసర్పాలు అవ కాశం కోసం ఎదురుచూస్తూ ఉంటాయి. పోరాడి గెలవటం ఎలాగూ సాధ్యంకాదు గనుక తెలివిగా తప్పించుకు తిరగాలి .... ఓమారు శేఖర్ 'రఘు త్రాచుపాములాంటివాడు' అన్న వాక్యం జ్ఞప్తి కొచ్చిం దామెకు .....

నెలరోజులు భర్తే సర్వస్వమని, అతని చిరునవ్వే తనకు మోక్షమని నమ్మిన రాధకు కొత్త ప్రపంచం కనపడింది. ఉదయంలేచి వంటపనిలో మునిగేందుకు మారుగా, షేక్స్ పియరు, న్యూమన్, షెల్లీ ఆమెను ఆహ్వానించి తమ తమ ఫిలాసఫీ బోధించారు. ఎప్పుడైనా సుభద్రమ్మకు ఇంటిపనిలో సాయపడేది. అడిగినప్పుడు భాగవతంలో పద్యాలు చదివి విని పించేది.

రఘు ప్రవర్తనలో మాత్రం కొన్ని మార్పులు వచ్చాయి. అతను ఎప్పుడో కాని రాధతో మాట్లాడేవాడు కాడు. ఆఫీసుకు ఎప్పుడు వెళ్లేది, ఎప్పుడు తిరిగి వచ్చేది ఆమెకు తెలిసేదికాదు. ఏదో రహస్యజీవితం సాగిస్తున్న ట్టని పించింది. ఒక్కొక్కప్పుడు అతను తన్ను అసహ్యించుకుంటు న్నాడేమో ననుకుని బాధపడేది.

ఓనా డుదయం పది గంటలు—

రాధ పుస్తకాలు తీసుకుని మేడ మెట్లు దిగి వస్తోంది. ఆనాడు తెలుగు లెక్చరరు సెలవు కనక పదకొండుకు వెడితే చాలు. క్రింద హాల్లో తల్లి కొడుకుల సంభాషణ విని ఆగి పోయింది.

'రాధ వెళ్లిపోయిందా అమ్మా ?'

రఘు ఆఫీసుకు వెళ్లటానికి సిద్ధంగా ఉన్నాడు.

'ఆ ! .... వెళ్లే ఉంటుంది. పూజ గదిలో ఉన్నాను కనక గమనించలేదు .... నిన్ను ఓ సంగతి అడగా లనుకుంటున్నా. రాధ కూడా నిన్న అడిగింది పాపం—అది వచ్చినప్పట్నుంచి నువ్వు ఇంటిదగ్గర సరిగ్గా ఉండటంలేదు. దాని యోగ క్షేమాలు బొత్తిగా కనుక్కోటం లేదట. రఘు అన్నయ్య కిష్టంలేకపోతే వెళ్లిపోతా నంటోంది .... ఉన్నట్టుండి ఇలా మారిపోయావేమిటి ?'

రాధ గుండెలు గబగబ కొట్టుకున్నాయి.

రఘు నవ్వాడు.

'నా ప్రవర్తన మీ ఇద్దరికీ చిత్రంగానే కనిపిస్తుంది. అంతేకాదు. వెగటు కలిగిస్తుంది కూడా. ఆ సంగతి నాకు తెలుసు. రాధతో అస్తమానం మాట్లాడుతూ, పగలబడి నవ్వుతూ పరాచికా లాడుతూ ఉన్నా ననుకో. ఆమె ఏమను కుంటుంది ? అందమైన అమ్మాయి కనపడగానే చెడు బుద్ధులు పుడుతున్నా యనుకుంటుంది. ఆమె పెద్ద అగా ధంలో పడింది. ఒక్కొక్కమెట్టు చొప్పున ఎక్కి పైకి రావాలి. అందుకు కొన్ని సంవత్సరాలు పడుతుంది. శేఖర్ రాధను ఓ వ్యక్తిగా చేయమన్నాడు. ఆ కోరిక నెరవేర్చే వరకూ నేను దూరంగానే ఉండాలి. ఆమె మనసు కష్టపడ కుండా నువ్వు కూడా చూడాలి.

గడియారం అరగంట కొట్టింది.

'అయితే మరి శేఖర్ తిరిగి రాడంటావా ? అప్సరస లాంటి పెళ్లాన్ని గంగలో వదలి దేశంమీదకు పోయాడు. తల్చుకుంటే వళ్లు భగభగ మంటోంది....'

'అతన్నని ఏంలాభం ? .... 'టి. బి' పేరు వింటేనే మనుష్యులు గడగడ లాడిపోతారు. అలాంటిది, ఆ వ్యాధి చేతుల్లో పడ్డాక మంచి చెడ్డ లేం తెలుస్తాయి ? .... అతను తెలివైన పని చేశాడు. రాధను నమ్మించి, చివరకు మోసం చేసే

కంటే—అతనిమీద అనురాగం, కలగకముందే అతని ఆవశ్య కతను గుర్తించకముందే వెళ్ళిపోయాడు .... అదే అతనిలో ఉన్న గొప్పతనం.'

సుభద్రమ్మ ముఖం చిట్లించింది. తప్పుచేసిన వ్యక్తిని సమర్థించటం ఆమెకు నచ్చలేదు.

రాధ కళ్లల్లో నీళ్ల నిలిచాయి.

'నాకేమో నమ్మకం కలగకుండా ఉంది. ఈ పట్నంలో ఉంటే ఆ రోగం నయం కాదా ఏమిటి ? మా కాలంలో క్షయంటే భయపడేవాళ్లం. ఇప్పుడు ఆపరేషన్లు, ఇంకజక్షన్లు మందులు కొత్త కొత్తగా వచ్చిపడుతున్నాయి.'

రఘు రెండు నిముషాలు మౌనంగా ఉండి అన్నాడు :

'ఎవరితోనూ అనక మనస్సులో దాచుకో. బొంబాయిలో ఉండే రెండు మూడు శానిటోరియాలకు అతను ఫోటో పంపి, వివరాలు తెలియజేయమని కోరాను. అలాంటి వ్యక్తి ఎవరూ లేరని సమాధానం వచ్చింది .... అంటే అతను బొంబాయి వెళ్లలేదన్నమాట. ఎక్కడున్నాడో తెలియదు.'

రఘు బయలుదేరబోతూ 'అమ్మా ! .... నిన్ను ఒక్క టడుగుతాను. నిజం చెప్తావా ?'' అనడిగాడు. సుభద్రమ్మ అతనికేసి ఆశ్చర్యంగా చూసింది.

'రాధ పరాయిపిల్ల. మనింటో ఉంచుకుని అభివృద్ధికి తీసుకురావటంలో నీకేమైనా అభ్యంతరముందా ? .... ఉంటే చెప్పమ్మా ! ఇష్టంలేక విందుకు పిలిచేకంటే కసిరి పొమ్మనటం బాగుంటుంది.'

'రఘు ! .... నువ్వు అమ్మను సరిగా అర్థం చేసుకో లేదు ..... నాన్నగారి ఆస్తి పది తరాలకు సరిపోతుంది.'

అతను తృప్తిగా నవ్వాడు.

'నేనూ ఒక ప్రశ్న అడుగుతాను .... నిజం చెప్పు ! .... శేఖరానికి క్షయ ఉన్నమాట నిజమేనా ? .... లేక అంతా బూటకమా ?''

రఘు ప్రశ్నకు సమాధానం చెప్పకుండా గడియారం వంక చూసి 'అయ్యె నాయనోయ్ ! అప్పుడే పదకొండు కావ స్తోంది .... ఆలస్య మైపోయింది' అంటూ గబగబ బయటికి వెళ్లిపోయాడు.

రాధ పుస్తకాలు టేబులుమీద విసిరి మంచంమీద కూలబడిపోయింది. దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కివెక్కి ఏడ్చింది. శేఖర్ క్షయతో వెళ్లిపోయాడని ఆమె పూర్తిగా నమ్మక పోయినా 'కావచ్చు' ననుకుంది. కాని మోసం చేశాడని తెలియ గానే ఆవేదన ఆగిందికాదు. తప్పుచేసి శిక్ష అనుభవించటం వేరు. అకారణంగా హింసకు గురికావటం వేరు. మాలిన్యాన్ని మంచితో కడగటం లాంటిది.

మంచితనం చాలా చెడ్డది. సరిహద్దులులేని దయతో, అభిమానంతో ప్రవర్తించే మనిషితో జీవించలేం. అతని ఔదార్యం ఆకాశంవరకూ వ్యాపించి చెడుగును కప్పివేస్తుంది. వ్యక్తిత్వాన్ని నశింపజేస్తుంది. రాధకూడా అలాగే బాధ పడింది. రఘు మంచితనానికి తను తగననుకుంది. మేడ మీదకు వచ్చినప్పుడు కాని సుభద్రమ్మకు రా ధ కనబడలేదు.

'రాధా ! .... నువ్వు కాలేజీకి వెళ్లలేదా ?'

రాధ ఉలిక్కిపడి తలెత్తి చూసింది.

'అదేమిటి ? .... కళ్లు రెండూ ఎర్రగా ఉన్నాయి!..... ఏడుస్తున్నావా ?'

'అబ్బే ! .... లేదండి ! .... కళ్లు కలిగాయి గామోలు !' అంది నవ్వటానికి యత్నిస్తూ.

'నేను వయసులో నీకంటే మూడు రెట్లు పెద్ద దాన్ని. అనుభవంలో కూడా అంతే. నా దగ్గిర అబద్ధం చెప్పకు. మొఖం చూడగానే మనసులో ఉండే అభిప్రాయాలు బయట పడతాయి.....'

సుభద్రమ్మ గంభీరంగా అంది.

'ఇందాకా, మీరూ—అన్నయ్యా మాట్లాడుకుంటుంటే విన్నాను. ఆయన కే రోగమూ లేదా ? ఆయన తిరిగి రారా ?'

సుభద్రమ్మ నవ్వింది.

'పిచ్చిదానా ! .... చదువు, వివేకం ఉండబట్టే ఒక ర్నొకరు అపార్థం చేసుకుంటున్నాం. ఒకే మాటకు, ఒకే చర్యకు, ఒకే అర్థం ఉంచక, రక రకాలుగా వ్యాఖ్యానిస్తారు.... శేఖర్ నిజంగా ఎందుకు పారిపోయాడో ఎవరికీ తెలియదు. అతన్ని గురించి బాధపడుతూ ఎంతకాలం ఇలా దిగులుగా ఉంటావ్ ? .... కులాసాగా, నవ్వుతూ ఉండేందుకు ప్రయ త్నించు. నిన్ను కంటికి రెప్పలా మేం చూసుకుంటాం. రఘు మాటలు విన్నావు కనక అతని ప్రవర్తనను అపార్థం చేసు కోకు ......'

రాధ కళ్లు తుడుచుకుంది.

ఆ సాయంత్రం సరళ వచ్చింది. రాధకోసం ఆమె రావటం ఇదే మొదటిసారి. రాధ ఆమెను ఆప్యాయంగా ఆహ్వా నించి సుభద్రమ్మకు పరిచయం చేసింది. సరళ సింగారం ఓ అడుగు ముందుకువేసింది. రెండు జెడలు వేసుకుని ముచ్చటగా మూడు గులాబీలు తురుముకుంది. తెల్లటి నైలాన్ చీర కట్టుకుంది. ఎడంచేతికి రిస్టువాచీ—మొదటి రోజున లేదు. ఈ మధ్యనేకొంది గామోలు! ఆమె! 'వి నెక్‌డ్' జాకెట్టు చూస్తుంటే రాధకు వళ్లు మండింది.

'పెళ్లికానమ్మాయి అడకువగా ఉండాలి కాని ఈ అహంభావ మెందుకు ?' అనుకుంది.

సుభద్రమ్మ కాఫీ తీసుకొచ్చింది.

ఆనాటి కాలేజీ విశేషాలు మాట్లాడుకున్నారు.

'రాధా ! .... మరో ముఖ్యమైన సంగతి. మన ఇంగ్లీషు లెక్చరరుగారు ప్రొఫెసర్‌గా ఢిల్లీ వెదుతున్నారు. రేపు సాయంత్రం సెండ్‌ఆఫ్. తలో రూపాయి చందా ఇచ్చాం. ఏర్పాట్లన్నీ త్వరగా జరుగుతున్నాయి.'

తరువాత రాధకు తెలియని కొత్త విషయాలు చెప్పింది. కొందరు కాలేజీ అబ్బాయిలు అమ్మాయిల వెంట ఎలా తిరిగేది, ఆకర్షించేందుకు ఎలా ప్రయత్నించేదీ వివరిం చింది. నీతికి అవినీతికి అట్టే భేదం లేదంది. అవినీతిగా బతకటంలో కూడా ఆనందం ఉందని సరళ వాదిస్తుంటే రాధ భయపడింది. సరళ ఇంటికి బయలుదేరుతుంటే రఘు

ఎదురు వచ్చాడు. ఇద్దరికీ పరిచయమైంది. మరో అరగంట ఆగి అతనితో ఖబుర్లు చెప్పి కదిలిపోయింది.

'రాధా ! .... జాగ్రత్తసుమా ! .... ఈ అమ్మాయి చాలా గడుసుది—జీవితాన్ని కనుక్కుంది.' అన్నాడు నవ్వుతూ.

రాధకు 'జీవితాన్ని కనుక్కోట' మేమిటో అర్థం కాలేదు. అడిగి తెలుసుకోవాలనుకున్నా కోరికను అణచివేసింది.

ఆ మర్నాడు 'సెండ్ ఆఫ్' బాగా జరిగింది. ప్రిన్సిపాలు, తతిమ్మా లెక్చరర్లు మాట్లాడారు. విద్యార్థినుల తరఫున సరళ మాట్లాడింది. వెళ్లిపోతున్న లెక్చరరుగార్ని ఆకాశాని కెత్తి అభినందించింది. సమావేశం పూర్తయ్యాక విద్యార్థులు ఆమె ఉపన్యాసాన్ని మెచ్చుకున్నారు.

ఇద్దరూ ఇళ్లకు బయలుదేరారు.

'అద్భుతంగా మాట్లాడావు సుమా ! .... ఆయన్ని నీ కింత బాగా తెలుసని నే ననుకోలేదు. అదీకాక ఆయన ఉపన్యాసం విమర్శనాత్మకంగాను, భావగర్భితంగానూ ఉంటుందని నువ్వు చెప్పేదాకా నాకు తెలియదు....'

సరళ విరగబడి నవ్వింది.

'నువ్వు వట్టి అమాయకురాలివి ! .... ఈ మనుష్యుల మధ్య ఎలా బతగ్గలవో నని దిగులుగా ఉంది నాకు. నిజం చెప్తున్నా ! .... ఆ మహానుభావుడి పాఠం ఇంతవరకూ ఒక్కనాడైనా నేను శ్రద్ధగా వినలేదు. ఆ క్లాసులో ఏదైనా నవల చదువుతూ కూర్చుంటాను. ఆయన పాఠం ఉత్త బోరింగు. వాగిందే పదిసార్లు వాగటం, ఎక్కడో చదివి కంఠస్థం చేసిన దంతా ఒక్కసారిగా కక్కేయటం.'

'మరి ముఖస్తుతి తప్పుకాదా ? .... మనసులో లేని మాటను కల్పించి ఒప్పుగా ఎందుకు చెప్పాలి ? ఇష్టం లేనప్పుడు ఊరుకోవచ్చుగా. ఈ నటనెందుకు ?' రాధ కొంచెం కోపంగా అడిగింది.

'ఎందుకా ? .... విద్యార్థులతోనూ, మేష్టర్లతోనూ పరిచయాలు చేసుకునేందుకు. వాళ్లతో సన్నిహితంగా ఉండక పోతే జీవితం ఎడారి అవుతుంది. ఎండమావుల కోసం వెతకే కంటే, దొంగచాటుగా మామిడిపళ్లు తినటం మేలు. ఒక్క మాట చెప్తాను. జ్ఞాపకం ఉంచుకో. జీవితం ఆనందించటానిక్కాని ఆదర్శాలతో ఉండేందుక్కాదు. ఈ ఇరవై సంవత్సరాలలో నేను ఏన్నో చిత్రమైన అనుభవాల్ని ఎదుర్కొన్నాను. జీవిత విధానాలు అనేకం. నిష్ఠగా, నియమంగా కొంతకాలం ఉన్నాను. మరికొన్నాళ్లు విచ్చలవిడిగా తిరిగాను. చివరకు ఒక్కటే నిర్ణయానికి వచ్చాను. హాయిగా ఉండగలిగినంత కాలం ఏపని చేసినా ఫరవాలేదు.

రాధకు భయం వేసింది 'జీవితాన్ని కనుక్కోట' మంటే ఇదేనా ? .... రాత్రి ఇల్లు చేరుకునేసరికి ఆమె జీవితం, ఉనికి ఆమెకే కొత్తగా కనిపించాయి. ఏదో మార్పు ఆమెకోసం ఎదురుచూస్తూ గడపదగ్గర కూర్చుని అవకాశం కోసం ఎదురు చూస్తోంది.

* * *

ఆ మర్నాడు రాధకు నిజంగా జ్వరం వచ్చింది. వద్దని వారించినా సుభద్రమ్మ డాక్టర్ని తీసుకొచ్చింది. రఘు కూడా దగ్గరే ఉన్నాడు. మూడు రోజులు విశ్రాంతి తీసుకోమని సలహా ఇచ్చాడు డాక్టరు.

'ఆయనకు మల్లే నాక్కూడా క్షయ వస్తుందేమో!'

'వస్తుందేమో ఏమిటి ? .... వచ్చిందనే అనుకోవాలి. వెంటనే నరాల నీరసం. ఆకలి లేకపోవటం. దగ్గు లేకపోయినా వస్తున్నట్టు భ్రమ. అన్నీ ఉంటాయి. నేనూ గమనిస్తున్నా. ఈ నాలుగు నెలలుగా నువ్వు ఎన్నో వూహించుకుని బాధపడుతున్నావు. టి. బి వచ్చిం దనుకోవటంలో అర్థం ఉందేమో కాని, 'ఆయనకు మల్లే' అని ఉపమానం తెచ్చుకోటం గత స్మృతులను తవ్వుకోటం. నిన్నని ఏం లాభం ?.... అది మానవుడి నైజగుణం. నచ్చని నిజాన్ని మర్చిపోటానికి యత్నిస్తాం. ఏదో కారణాన్ని ఆధారంచేసుకుని జ్ఞాపకం తెచ్చుకుంటాడు.'

రాధ అతన్ని గౌరవభావంతో చూసి తల వంచుకుంది.

రఘు మందుసీసాతో వెళ్లిపోయాడు.

మొదటి రెండు రోజులు సరళ వచ్చి పోయింది. మూడో నాడు సాయంత్రం ఆమె ముఖం చూడగానే 'కొత్త సంగతి' కనిపించింది.

'ఎలా ఉందని అడక్కుండానే చెప్తాను. బాగానే ఉంది. జ్వరం లేదట. తలనెప్పి మరి రాదు. నీరసం మాత్రం నీడలా ఉంది. మనసు మణుగు బరువు మోయలేక గిలగిల తన్నుకుంటోంది.' అంది రాధ నవ్వుతూ.

సరళ ఆమె కెదురుగా సోఫాలో కూర్చుంది.

'నాకు తెలుసు. నీ మనోవ్యాధికి నా దగ్గర మందు ఉంది. కాని అప్పుడే ఇవ్వలేను. మరికొంతకాలం ఆగాలి. కొన్ని రోగాల్ని తలెత్తగానే మొదలంట నరికివేయాలి. కొన్నింటిని ముదరబెట్టి నయం చేయాలి. నీ వ్యాధి రెండో రకానికి చెందినది కనక కాస్త వోపిక పట్టు. అన్నట్టు మరో సంగతి. కొత్త ఇంగ్లీషు లెక్చరరుగారు వచ్చేశారు. ఆయన 'పర్సనాలిటీ' ఒక ఎత్తు. పాఠం చెప్పే పద్ధతి మరో ఎత్తు. దరిదాపు ఆరడుగుల ఎత్తు. ఎర్రటి శరీరం. ఉంగరాల క్రాపు, క్లాసునంతా అయస్కాంతంలా ఆకర్షించివేశారు. కొందరు అల్లరి అబ్బాయిలు తుఫాను లేవదీయటానికి ప్రయత్నించారు కాని ఆయన చమత్కారంగా, అందరూ తల వంచుకునేట్టు, మెత్త మెత్తగా చీవాట్లువేసి కూర్చోబెట్టారు. తరువాత ఒక్కటే నిశ్శబ్దం. షేక్స్పియర్ రచనల్ని గురించి ఉపన్యాసం యిచ్చారు. అబ్బబ్బ ! ఎంత గొప్పగా ఉందనుకున్నావ్ ? ఇలియట్ కూడా ఆయనముందు వోడిపోవలసిందే ! .... ఖంగుమనే కంఠస్వరం, ఎప్పుడూ చిరునవ్వు. అలా ఆయన ఉపన్యాసం వింటూ కూర్చోవా లనిపిస్తోంది'

రాధ ఆమెకేసి చిత్రంగా చూసి ఫక్కున నవ్వింది. సరళ కొద్దిగా కంగారుపడేసరికి మరింత విరగబడి నవ్వింది.

'మొదటిసారి చూడ్డంతోనే మోజు కలిగిందన్నమాట. ఆయన్ని ప్రేమించావా ? పెళ్లి చేసుకుంటావా ?'

సరళ క్కోపం వచ్చింది.

'నువ్వు వేళాకోళాని కడిగినా నిజం అంతే. అవకాశం వస్తే వదులుకోను.' గంభీరంగా అంది. సుభద్రమ్మ అక్కడకు వచ్చేసరికి సంభాషణ ఆగిపోయింది. సరళ మరో గంట 'బాతాఖానీ' కొట్టి బయలుదేరింది.

'జ్వరమని, అనారోగ్యమని వెర్రి వేషాలు వేయక రేపు బుద్ధిగా బడికి వచ్చేయాలి సుమా!' అంది గుమ్మం దిగుతూ.

ఆ మర్నాడు రాధ తొందర తొందరగా కాలేజీకి బయలు దేరింది. సుభద్రమ్మ మరో రెండు రోజులు విశ్రాంతి తీసుకోమన్నా ఆమె వినే స్థితిలో లేదు. కొత్త లెక్చరరు రూపురేఖల్లో ఆమెకు కుతూహలం లేదు. పాఠం వినాలనే ఆకాంక్ష అవధులుదాటి పరుగెత్తింది.

క్లాసులో తతిమా విద్యార్థినులు కూడా 'కొత్త లెక్చరర్ని' గురించే మాట్లాడుకుంటున్నారు. ఏ వస్తువుకూ ప్రత్యేకమైన విలువలేదు. మరో వస్తువుతో పోల్చినప్పుడే దాని ప్రాధాన్యం తెలిసి వస్తుంది. అలాగే కొత్త లెక్చరరు పాఠం విన్న విద్యార్థులకు పాత లెక్చరరుమీద గౌరవం పోయింది..

రెండో పీరియడు రానే వచ్చింది.

కొత్త లెక్చరరు వచ్చారు. ప్లాటుఫారంమీద నిలబడి క్లాసునంతా ఒక్కసారి చిరునవ్వుతో చూశారు. సరళ కన్నార్పకుండా చూస్తూ ఉండిపోయింది.

రాధ ఉలిక్కిపడింది. ఆమె చుట్టూ భూమి భయంతో వణకింది. సముద్రాలు పొంగి ఆమెను ముంచివేశాయి. ఆకాశం చీకటి మబ్బులలో సమాధి కట్టింది. నిమిషాలు గడిచి పోయాయి. ఆయన పాఠాలు చెబుతూనే ఉన్నాడు. విద్యార్థులు శ్రద్ధగా వింటూ తెలియనివి రాసుకుంటున్నారు. రాధ మాత్రం శిలాప్రతిమలా చైతన్యం లేకుండా అలాగే కూర్చుంది.

గంట కొట్టారు.

ఆయన వెళ్లిపోయాడు.

'ఎలావుంది ?' అనడిగిన సరళ ప్రశ్న ఆమె చెవుల్లో పడలేదు. ఆమె కళ్లు కదలికలేకుండా నిశ్చలంగా నిలబడ్డాయి.

'నిన్నే ? .... ఏం ? .... అలా రాతిబొమ్మలా కూర్చున్నావ్ ?' అంటూ సరళ భుజాలు పట్టుకు కదపింది.

'ఎలాఉంది ఆయన పాఠం ?'

'అద్భుతంగా ఉంది .... సరళ ! .... నాకు మళ్లీ జ్వరం వచ్చినట్టుంది. ఇంటికి వెడుతున్నా. తల తిరుగుతున్నట్టుంది' అంది లేచి నిలబడుతూ.

'అలాగా ! .... పోనీ, నేను తోడు రానా ?'

'వద్దు—రిక్షా చేసుకుపోతాను.'

ఇల్లు చేరుకుని మంచంమీద వాలిపోయి తలగడలో ముఖం దాచుకుని వెక్కి వెక్కి ఏడ్చింది.

*        *        *

'మధ్యాహ్నమే వచ్చేసింది. ఏమే అంటే వంటో తిరగబెట్టిందట. పోయి పడుకోమన్నా. సాయంత్రం వచ్చి చూసే సరికి ఏడుస్తూ కూర్చుంది.'

కొడుకుతో సుభద్రమ్మ ఫిర్యాదు చేసింది.

రఘు మంచం దగ్గరకు వచ్చాడు. రాధ లేచి కూర్చుంది. కళ్లు రెండూ ఎర్రగా ఉన్నాయి.

'ఏడ్చి కష్టాలు గట్టెక్కే పక్షంలో అందరూ నవ్వుతూ ఉండేవారు.' అన్నాడు. రాధ సమాధానం చెప్పలేదు.

'మళ్లీ ఏమొచ్చింది రాధా ! .... నువ్విలా అస్తమానం ఏడుస్తూ కూర్చుంటే ఎలా ?'

'అందుక్కాదన్నయ్యా ! .... ఆయన వచ్చా రీవూరికి.'

'ఎప్పుడు ? .... ఎక్కడ చూశావ్ ?' అనడిగింది సుభద్రమ్మ.

'వెళ్లిపోయిన ఇంగ్లీషు లెక్చరర్ స్థానంలో ఈయన వచ్చారు. నిన్న సరళ వర్ణించింది ఈయన్నే !'

రఘు మౌనంగా ఉండిపోయాడు. అతనికేం చెప్పటానికి తోచలేదు.

'అంటే క్షయ అబద్ధమన్నమాట !' అంది సుభద్రమ్మ.

'అవును. ఆ సంగతి నా కేనాడో తెలుసు.'

రఘు అటూ యిటూ పచార్లు చేయసాగాడు. ఈ వికృతాలను సరిదిద్ది అందంగా తయారుచేసే దెలాగో అతని కర్థం కాలేదు. హృదయంలో ఏమూలో ఉండే ఆశాజ్యోతి జీవించమంటుంది. కాని దీపంలో నూనె లేనప్పుడు దాని వెలుగు ఎంతకాలం ?

'ఆయన్ని కలుసుకుని కొన్ని ప్రశ్నలు అడగాలనుంది నాకు .... ' అంది రాధ.

ఆమె అడిగే ప్రశ్నలేవో అతనికి తెలుసు.

'అందువలన ఎలాంటి ప్రయోజనమూ ఉండదు. అక్కడక్కడ మనగ్గా కనిపించే చీకటి మరకలు అంతటా వ్యాపించి అంధకారంలో ముంచివేస్తాయి. అతను నిన్ను వదలిపోయిన కారణం తెలియనంతకాలం ఆవేదన తక్కువ. నిజం తెలుసుకుని బాధపడేకంటే తెలియకుండా సుఖంగా ఉండటం మంచిది. అంతమాత్రంచేత అతన్ని వూరికే వదిలేయకూడదు. నేను రేపతన్ని కాలేజీలో కలుసుకుని నిజానిజాలు తెలుసుకుంటాను.'

రఘు మాటకు ఎవరూ అభ్యంతరం చెప్పలేదు. రాధ గుండెల్లో భయంకరనిశ్శబ్దం నెలకొంది.

ఆ మర్నాడు రాధ కాలేజీకి వెళ్లలేదు.

రఘుకోసం ఎదురుచూస్తూ కూర్చుంది. అతను వచ్చేసరికి రెండు దాటింది.

'కలుసుకున్నావా ? .... ఏమన్నాడు ?' అనడిగింది సుభద్రమ్మ.

'లేదు. అతను నిన్న సాయంత్రమే రిజైన్‌చేసి వెళ్లిపోయాడట. ఇప్పు డిప్పుడు నా కంతా అర్థమవుతోంది. మనం కాకినాడ వచ్చిన సంగతి అతనికి తెలియదు. నిన్న క్లాసులో రాధను చూడగానే అర్థమైంది. వెళ్లిపోయాడు. తుఫాను వస్తుందని తెలుసుకున్నాడు పాపం ?'

ఓ నిముషంపాటు రాధకేసి చూస్తూ ఉండిపోయాడు. ఆమె ముఖంలో చిత్రమైన మార్పులు కన్పించి అదృశ్యమయ్యాయి.

'రాధా ! .... నేను చెప్పదల్చుకున్న దిది. శేఖర్ వ్యాధి గ్రస్థుడు కాడు. ఏదో కారణంచేత నిన్ను వదులుకున్నాడు. కనక అతని గురించి ఆలోచించడంమానేసి నీ జీవితాన్ని సరి దిద్దుకోవాలి. అతను లేని లోపం కనపడకూడదు. పునర్వి వాహం మంచిదైనా, నీ విషయంలో ఎలా సాధ్యమవుతుందో నా కర్థంకాదు. అదీగాక పునర్వివాహం గత జీవితాన్ని కెలికి వేస్తుంది. తృప్తిగా జీవించేందుకు మార్గాలు చాలా ఉన్నాయి. ఫలానా మార్గం మంచిదని నేను చెప్పలేను. నువ్వే అన్వే షించుకుని తెలుసుకోవాలి. రత్నాలతోబాటు గాజుపెంకులు కూడా మెరుస్తాయి. ఏరుకోటంలోనే మన జయాపజయాలు ఆధారపడి ఉంటాయి.'

రాధ ఈ మారు ఏడవలేదు. ధైర్యంగా నవ్వుకుంది. మేడమీదకు వెళ్లి కిటికీ దగ్గర కూర్చుంది.

శేఖర్ మరి తిరిగిరాడు. వచ్చినా, అతనికి తనకు మధ్య శాశ్వతంగా తెర నిలిచింది. తెరను తొలగించటం, చీల్చి వేయటం అసాధ్యమైన పనులు. చిన్న కన్నంచేసి అందులోంచి ఒక రొకరు చూసుపోవచ్చు. కాని ఒకరు చూస్తున్నట్టు మరొకరికి తెలియకూడదు. తెలిసినా తెలియనట్లు నటించాలి. అతని హస్తాల్లో ఓ అందాలరాసి నలిగిపోతున్నా రాధ చూడ నట్టు వూరుకోవాలి. అంతేకాదు. ఎక్కడైనా, అనుకోకుండా ఒకరి కొకరు ఎదురుపడితే 'నేను ఫలానా' అని పరిచయం చేసకుని యోగక్షేమాలు విచారించుకోవాలి.

రాధ కేదో వెర్రి ఆవేశం వచ్చింది. ఎవరిమీదో పగ తీర్చుకోవా లనిపించింది. అద్దంలో ముఖం కడుక్కుంది. చెద రిన ముంగురులు, ఎర్రబడిన కళ్లు, వీటితో వాడిన గులాబీలా ఉంది. చక్కగా స్నానంచేసి కడిగిన ఆణిముత్యంలా మెరసి పోయింది. రెండు జడలు వేసుకుని పెళ్లినాటి రవ్వల దుద్దులు పెట్టుకుంది. నెక్లెస్, సిల్కుచీర, రిస్టువాచీ అన్నీ కారా గారంనుండి విడుదలై ఆమె నలంకరించాయి. అద్దంలో చూసు కుని ఆశ్చర్యపడింది.

రాధ నవ్వుతూ కిందకు దిగి వచ్చేసరికి గడియారం మూడు కొట్టింది. రఘు ఆఫీసుకు వెళ్ళి పోయాడు. భాగవతం చదువు కుంటున్న సుభద్రమ్మ ఆమెను చూసి తెల్లబోయింది. సానబెట్టిన వజ్రం — కాటుక పెట్టుకున్న కళ్ళు — పోషించ బడిన సౌందర్యం — ఆమె అభిప్రాయం అర్థం చేసుకున్న రాధ సిగ్గుతో తల వంచుకుని చిరునవ్వు నవ్వింది.

'ఈ నాటికి నువ్వు నాకు పూర్తిగా నచ్చా వమ్మాయ్.' అంది సుభద్రమ్మ మనస్ఫూర్తిగా.

'రాధా రాణిగారు ! ... నమస్కారం ! మీ దివ్యరూప సందర్శనంతో ధన్యురాల నైతిని.' అంటూ సరళ వచ్చింది.

'సమయానికి వచ్చింది నీ స్నేహితురాలు ! ఇద్దరూ మాట్లా డుతూ కూర్చోండి .... చిన్న కునుకు తీస్తాను' అంటూ సుభ ద్రమ్మ లోపలికి పోయింది.

'ఏమిటి రాధా విశేషం ? .... పెళ్లిచూపులా ?' అంది సరళ కనుబొమ లెగరేస్తూ.

'ఏముంది ? .... నువ్వే చెప్పాలి. కొత్త లెక్చరరుగా రేమం టున్నారు ?'

సరళ ముఖం వాడిపోయింది.

'ఏమంటారు ? .... వచ్చిననాడు సాయంత్రమే జండా ఎత్తేశారు. చిత్రమైన మనుష్యులు—చిత్రమైన లోకం.'

'ప్రేమించావు—పెళ్లి చేసుకుందా మనుకున్నావ్. నీకు తీరని ఆశాభంగం—ఆకలి ఉండదు... నా సానుభూతి స్వీకరించు.'

'సరే ! సరే ! .... నేను బాధపడేరకం కాదు. ఏనాటి సంఘటనలు ఆనాటితో మర్చిపోతాను. నా క్కావలసిందికొత్త కొత్త అనుభవాలు. ఎప్పుడూ ఒకేరకంగా జీవించటంలో ఆనంద మేముంది ? .... మనం ఉండేది కేవలం తిని నిద్రపోడాని క్కాదుగా ! .... ఇంతకూ ఏమిటి సంగతి ? అజంతాసుందరిలా తయారయ్యాయ్. ఎవరికోసం ఇదంతా ? .... ఒక్కరోజులో హఠాత్తుగా మారిపోయావు .... నిన్నటి రాధను వర్ణించ మంటావా ? సగం సగం అల్లి అశ్రద్ధగా వదిలేసిన జెడ, ముతక జాకెట్టు, నూలు చీర వెలవెల పోతున్నది. పౌడర్ని చూడగానే కోపగించుకున్న ముఖం .... ఎప్పుడూ దిగులుగా ఏదో ఆలోచించటం. ఎవరికోసమో, అయిష్టంతో జీవిస్తున్న భావన .... ఇవి నీలో ముఖ్యాంశాలు. అలాంటి నన్నిటి రాధ ఈ నా డిలా కొత్తరూపం దాల్చిందంటే ఏమనుకోవాలి ?'

'ఏమీ అనుకోవద్దు. తృప్తి, ఆనందం ఇవెక్కడ దొరుకు తాయో తెలుసుకోదల్చుకున్నా. అన్నయ్య అన్వేషించి కనుక్కో మన్నాడు—మార్గాలు చాలా ఉన్నాయట.'

'మీ అన్నయ్య మాట అక్షరాలా నిజం ! .... నేనూ నీలాగే అన్వేషణ కొనసాగించి వెలుగు కనుక్కున్నా. కవికి కవిత్వం ప్రాణం. గాయకుడికి తన గానం సర్వస్వం. చిత్ర కారుడు తను గీసిన బొమ్మల్ని చూసుకుని ఆనందంతో ఉప్పొంగిపోతాడు..... అలా ఒక్కొక్కరికి ఒక్కొక్క మార్గం నచ్చుతుంది. మాటలతో కోటలు కడుతూ కాలాన్ని వృథా చేస్తున్నాడని కవిని విమర్శించి ఏం లాభం ? .... పిచ్చి గీతలు గీస్తున్నాడని చిత్రకారుణ్ణి జైల్లో పెడితే ఎలా ? .... అలాగే నాకు నచ్చిన మార్గాన్ని మంచిది కాదని వాదించటం తెలివి తక్కువ.'

'అబ్బ ! .... నీ ఉపమానాలు చాలించి నువ్వు కను క్కున్న రహస్యాన్ని నా కుపదేశంచేద్దూ ! .... నీకు పుణ్య ముంటుంది.'

సరళ గుండెలమీద అరచేయి వేసుకుని 'అమ్మో ! .... ఒక్కరోజు ఎలా చెప్పటం ? .... స్వానుభవంమీద తెలుసు కోవాలిగాని' అంది.

అంతటితో రాధ ఆ 'టాపిక్' వదిలేసింది. కాలేజీ విశే షాలు తప్పించి ఇంకేమున్నాయి మాట్లాడుకోటానికి ?

'ఇంటో కూర్చుని ఏం చేస్తావ్ ? .... అలా నడిచి వద్దాం పద.' అంది సరళ.

సుభద్రమ్మతో చెప్పుకుని రాధ బయలుదేరింది.

ముందుగా సరళ ఇంటికి వెళ్లారు. ఆమెతో పరిచయమై ఆరు నెలలు కావచ్చినా ఇంతవరకూ ఆమె ఇంటికి వెళ్లలేదు. ఇల్లు చిన్నదైనా చూట్టానికి అందంగా ఉంది. డ్రాయింగురూం ఆకర్షణీయంగా ఉంది. సరళ రకరకాల పోజుల్లో తీయించుకున్న ఫోటోలు గోడల్ని నింపేశాయి.

'నేనూ, అన్నయ్య, అమ్మ నాన్న—మేం నలుగురు మెంబర్లం. అంతే. అన్నయ్య బాంకిలో కాషియర్—అరు గంటలకు వచ్చేస్తాడు. భలే సరదా అయిన మనిషిలే—పరిచయం చేస్తాను రానీ—నీకే తెలుస్తుంది.'

'ఎలెక్ట్రిక్ క్లాక్' లో ఐదైంది.

సరళ తల్లి మరీ మితభాషి. అరముక్క మాట్లాడిందంతే !

'కాఫీ తీసుకొస్తాను. రేడియో వింటూవుండు' అంటూ లోపలికి వెళ్లింది సరళ.

రాధ షెల్ఫ్‌లో ఉన్న పుస్తకాలన్నీ చూడసాగింది. సినిమా పత్రికలు, నవలలు కోకొల్లగా ఉన్నాయి. డైరీ ప్లాస్టిక్ కవరుతో అందంగా ఉంటే, తీసి పేజీలు తిరగేస్తుంటే ఏదో ఫోటో జారి కిందపడింది. రాధ ఆశ్చర్యపోయింది. సరళ తన జీవితంలో ఇంతటి రహస్యాన్ని దాచిఉంచిందని ఆమె ఎన్నడూ వూహించలేదు.

సరళ కాఫీ కప్పులతో వచ్చింది.

'నిజాన్ని నీ దగ్గర్నుంచి దాచి ఉంచినందుకు క్షమించు రాధా ! ....' అంటూ ఆమె భుజంమీద చేతులువేసింది సరళ. మోయలేనన్ని దండలతో, సిగ్గుతో చిరునవ్వులు విసురుతున్న సరళకు, ఎదురుగా, గంభీరంగా, తెలివిగా, చమత్కారంగా, కొంటెగా నవ్వే సరళకు ఎంతటి విభేదం !

"నేనే క్షమాపణ వేడుకోవలసుంది .... నీ అనుమతి లేకుండా .... ' అని నసిగింది రాధ.

'ఛీ ! .... నికూ నాకూ మధ్య అలాంటి తెర ఏమీ లేదు. నేనే చెప్పాలనుకున్నా ఏనాటి కానాడు వాయిదావేస్తూ వచ్చాను .... '

'మీ ఆయన చాలా బాగున్నాడు సరళా ! .... అదృష్టవంతురాలివి.'

సరళ ముఖం వాడిపోయింది.

'నువ్వు పొరబడుతున్నావు. ఆయన నాకు దూరమైపోయారు .... '

'సరే ! .... అయితే ఇద్దరం ఒకే తరగతికి చెందినవాళ్లమన్నమాట !'

'కాదు రాధా ! .... విభేదం ఉంది. ఇద్దరం చెరో ఒంటిస్తంభం మేడమీద ఉన్నామనుకో—ఒకరు దూరంగా విసిరివేయబడ్డారు. మరొకరి విషయంలో మేడ కూలిపోయింది.'

'అంటే .... అంటే .... మీ ఆయన ?'

'అవును. పెళ్లయిన ఆరు నెలలకు పోయారు. అవును రాధా ! .... నువ్వు నమ్మితీరాలి ! నేను విధవను—కాని ఎవరు ఒప్పుకుంటారు ? చేతులనిండా గాజులు—రోజుకో రకమైన సింగారం, తలనిండా పూలు, గులాబీ, చామంతి, మల్లె అన్నీ—రెండు జెడలు— నుదుటిమీద పెద్ద కుంకంబొట్టు. ఇవన్నీ చూశాక నేను విధవనని ఎవ రనుకుంటారు ? .... జుత్తు తీసేసుకుని, తెల్ల బట్టలు కట్టుకుని, చీకటి గదిలో ఎవరికీ కనపడకుండా 'ఎప్పుడు తెల్లవారుతుందని' కూర్చుంటే 'ధర్మం నిలిచింది' అంటారు. అలా ఎంతకాలం కూర్చోటం ? చావంటూ వస్తేకాని 'తెల్లవారట' మంటూ ఉండదు. అందుకే గతాన్ని ముక్కలుగా చింపివేశాను. అమ్మ, నాన్న గాజులు తొడుక్కొనేందుకు, బొట్టు పెట్టుకునేందుకు 'ససేమిరా' ఒప్పుకోమన్నారు. అమ్మ నూతిలో దూకి చస్తానంటే, నాన్న సన్యాసం పుచ్చుకుంటా నన్నాడు. ఒక్క అన్నయ్య మాత్రం అండగా నిలిచి అందర్నీ ఎదిరించాడు. అవసరమైతే నన్ను తీసుకుని వేరే ఉంటానని గర్జించాడు..... చివరకు సమ్మతించారు. కాలేజీలో చేర్పించాడు. నా స్వేచ్ఛను అత నెన్నడూ అడ్డగించడు. నా అభిమతానికి ఎదురు చెప్పడు. ఎవర్నయినా పెళ్లి చేసుకున్నా వద్దనడు. అందుకే నిన్ను కూడా పుస్తె తీసి దాచేయమని ధైర్యంగా సలహా యిచ్చాను. దాని విలువ ఏనాడో పోయింది. నీ గురించి అన్నయ్యతో చాలా చెప్పాను. తీసుకురమ్మంటాడు .... '

రాధ నిట్టూర్చింది.

మనిషికి తన జీవితంమీద స్వేచ్ఛ లేదట. ఈ నిజం రాధను ఆశ్చర్యంలో ముంచివేసింది. మనసులో సహజంగా చెలరేగే కోర్కెలను అణచివేయాలి. సంఘం—కట్టుబాట్లు-ఆచారాలు—ఇవన్నీ అందుకు సాయపడతాయి.

సరళ ఫోటోతీసి డ్రాయర్లో భద్రపరచింది. మరి పది నిముషాలకు సరళ అన్నయ్య రవణ వచ్చాడు. అతన్ని చూడగానే రాధ కోవిధమైన గౌరవభావం కలిగింది. అతనులేకపోతే సరళ గతి ఏంకాను ? సరళ రాధను పరిచయం చేసింది. రవణ చిలిపిగా చమత్కారంగా మాట్లాడాడు. అతని ప్రతి మాటలోనూ రాధకు ఏదో కొత్తదనం, ఆకర్షణ కనిపించాయి. అందుకు తగ్గట్టు రవణ చూట్టానికి అందంగా ఉన్నాడు కూడా.

చీకటిపడుతుండగా రాధ తిరుగుముఖం పట్టింది. ఆమె హృదయం తేలికైంది. రోడ్డు కిరువైపునా ఉన్న దీపాల వరుసలు ఆమె కో వెలుగుబాటను చూపించి నట్లయింది. తనలో కలిగిన మార్పును రాధ ఈ ఉపమానంతో అర్థం చేసుకుంది. "అలా అలా నడిచిపోతూవుంటే తళతళ మెరిసే ఓ రాయి కనపడింది. దానికి విలువ లేదని తెలిసినా, పెట్టె అడుగున పడేసింది... సరళ ఓనాడు పెట్టె అంతా గాలిస్తూ ఈ గాజు ముక్కను పైకితీసి సానబెట్టింది. 'చూశావా రాధా ! .... నువ్వు మోసపోయావు. ఇది గాజుపెంకు కాదు .... వజ్రం!' అంది!

ఆ మర్నాటినుండి రాధ జీవిత విధానాలను మార్చుకుంది. ఉదయం లేవగానే పాఠాలు చదువుకోటం, గంటసేపు సింగారించుకోటం, సరళ ఇంటికి వెళ్లి ఆమెతో కాలేజీకి వెళ్లటం, సాయంత్రం ఆమెతో సినిమాకో, పికారుకో పోవటం, ఒక్కోనాడు సరళ ఇంటిదగ్గరే ఉండిపోయేది. రవణ

అప్పుడప్పుడు వీళ్ళతో కలిసేవాడు. రఘు మాత్రం యధా ప్రకారంగా అంటీ అంటనట్టు ఉంటూ వచ్చాడు.

కాలేజీలో కూడా ఆమెను కొత్త అనుభవాలు ఎదుర్కొన్నాయి. సరళ ప్రోత్సాహంమీద కొందరు విద్యార్థులతో పరిచయాలు చేసుకుంది. తరుచు వాళ్ళతో కలిసి ఏ వేవో చర్చలు సాగించేది. ఒకసారి క్లాసు డిబేటలో మాట్లాడింది. విద్యార్థులు అల్లరి చేసినా ఆమె నిలబడగలిగింది. తను ఎక్కడికి వెళ్ళేది, తనచుట్టూ ఎలాంటి చిక్కులు అల్లుకుంటున్నది ఆమె ఆలోచించలేదు. గమనించనూ లేదు. సరళ చెప్పిందే వేదవాక్యం. ఆమె చూపిందే రుజుమార్గం. ఎవరైనా అబ్బాయిలు వెంట పడితే రాధ కంగారు పడేది. సరళ లెక్కచేసేది కాదు.

'మరేం ఫరవాలేదు. అందంగా ఉన్నాం కనక వస్తున్నారు .... సౌందర్యోపాస నవ్వమాట. గర్వించతగ్గ విషయం కాని బాధపడవలసింది కాదు.'

రాధ కొంతసేపు ఆలోచించి 'పోనీ మనం ప్రిన్సిపాలుకు రిపోర్టు చేస్తే ?' అంది.

'ఏడ్చినట్టుంది. ఇదంతా మన కిష్టంలేనప్పుడు కదా ప్రిన్సిపాలుదాకా వెళ్ళేది. ఇందులో నాకేం తప్పు కనిపించలేదు. వాళ్ళు మనకో ప్రత్యేకతను ప్రసాదించి గౌరవంతో సాగనంపుతుంటే విసుక్కోటం ఏం బాగా ఉంటుంది చెప్పు ? .... నీ కభ్యంతరం లేకపోతే, అలా రెండు గజాల దూరంలో నీడలా అనుసరించేకంటే, హాయిగా మనతో కలిసి రమ్మంటాను' అంది సరళ.

రాధ ఆమెతో వాదించి లాభంలేదనుకుని వూరుకుంది. ఇంటికి వచ్చేసరికి హాల్లో మాటలు వినిపించాయి. రాధ అరుగుమీదే నిలబడింది.

'అమ్మాయి తెలివైందనుకున్నా. ఇంతగా దిగజారిపోతుందని తెలిస్తే ముందుగానే జాగ్రత్త పడేదాన్ని. నువ్వు లక్ష చెప్పు రఘూ ! .... ఆడదానికి స్వేచ్ఛ ఇవ్వకూడదు. అడకత్తెరలో నొక్కివుంచాలి.'

రాధ గుండెలు గబగబ కొట్టుకున్నాయి. రఘు నవ్వాడు.

'నువ్వు అమాయకురాలివి. అమ్మా ! .... ఎవరో ఉత్తరం రాశారని నమ్మేయటమేనా ? అందులో ఉండే నిజానిజాలు తెలుసుకోవద్దూ ? .... రాధ మనస్తత్వం నీ కింకా అర్థం కాలేదు.'

'అదంతా నాకు తెలియదు. ఆ అమ్మాయిని కాస్త అదుపులో ఉంచాలి. కాలేజీనుండి రానీ. ఈ ఉత్తరం చూపించి అడుగుతా.'

'నీకు పుణ్య ముంటుంది. ఆపని మాత్రం చేయకు. అసలే సున్నితమైన మనస్సు. బాధపడిందంటే ఏ అఘాయిత్యాని కొడిగడుతుందో ! .... అదీకాక, నీతి బోధనలు చేసి వో మనిషిని మంచిగా చేయలేం. తనంతట తనే కష్టాల్ని ఎదురుగాలుల్ని ఎదుర్కొని, తెలుపు నలుపులు తెలుసుకోవాలి. నాలుగు రకాల జీవితాల్లో ఉండే ఎత్తు పల్లాలు తెలుసుకుంటేనే కాని తనకేం కావాలో తెలియదు .... అందుచేత ఆమె అన్వేషణకు మనం అడ్డుపడకూడదు. మన అభిప్రాయాలు, ఆదర్శాలు ఆమె నెత్తిన రుద్దటం న్యాయంకాదు ..... బొమ్మకు రంగు కాగితాలు అంటిస్తే ఎంతకాలం నిలుస్తాయి ? .... శాశ్వతంగా నిలబడే రంగులు వేయాలి .'

'సరే బాబూ ! .... నీమాట ఎందుక్కాదనాలి ? నేను పల్లెత్తుమాట అనను. రాధమీద నాకుండే అనురాగం అలాంటిది.'

మరో అయిదు నిమిషాలు గడిచాక రాధ ఏమీ ఎరగనట్టు లోపలికి వెళ్ళింది. సుభద్రమ్మ యధాప్రకారంగా నడచుకుంది. రఘు క్లబ్బుకు వెళ్ళిపోగానే పుస్తకంలో అతను భద్రపరచిన ఉత్తరం తీసి చదువుకుంది. ఆకాశరామన్న రాసింది. దస్తూరీ ముచ్చటగా ఉంది. ఏ అమ్మాయైనా రాసిందేమో !

'మీరు గౌరవ కుటుంబంలోనివారు. మీ నాన్నగారు వకీలుగా గొప్ప కీర్తి నందుకున్నారు. కాని ఈ అమ్మాయి మూలంగా కళంకం ఏర్పడుతోంది. కాలేజీలో చదువుతున్న మాత్రాన, అబ్బాయిలతో స్వేచ్ఛగా కలిసి మెలిసి తిరగాలని ఎక్కడ రాసుంది ? మన దేశ పరిస్థితులకు, సాంఘీ కాచారాలకు, ఈ ప్రవర్తన తగదు. పాశ్చాత్య దేశాలలో ఈ సాన్నిహిత్యం ప్రమాదాలకు దారితీయకపోవచ్చు. ఎక్కడ చూసినా మీ రాధే కనిపిస్తుంది. ఆమెవెంట ఆ సరళనే అమ్మాయి కూడా! ఆ అమ్మాయి చరిత్ర—ఆమె కుటుంబ చరిత్ర అందరికీ తెలిసిందే ! కనుక మీ శ్రేయస్సు కోరి రాస్తున్నా. వ్యవహారం చేయిదాటేముందు అదుపులో ఉంచండి. అనక పశ్చాత్తాపపడి ప్రయోజనం లేదు.'

రాధ కోపంగా ఉత్తరం ముక్కలు ముక్కలుగా చించివేసింది. తరువాత తను చేసిన పని పొరపాటేమోననిపించింది. రఘు 'ఉత్తరమేది ?' అనడిగితే ఏం సమాధానం చెప్తుంది? అయినా ఈ 'శ్రేయోభిలాషి' తన విషయంలో కనుక్కున్న నిజం ఏమిటి ? అబ్బాయిలతో మాట్లాడటం, సరళతో తిరగటం—ఇవన్నీ అతను కనుక్కున్న మహాపరాధాలు ! .... రాధ నవ్వుకుని అంతా మర్చిపోయింది.

మొదటి సంవత్సరం పూర్తికావచ్చింది.

పరీక్షలు చకచక జరిగిపోతున్నాయి. చదువుకోటానికే ఉన్న సమయం చాలకపోవటంచేత సరళను కలుసుకోటం వీలుపడలేదు.

కెమిస్ట్రీకి, ఫిజిక్సుకు మధ్య ఓరోజు విరామం వస్తే సరళను చూట్టానికి సాయంత్రం బయలుదేరింది. ఆమె వెళ్ళేసరికి అన్న, చెల్లెలు సినిమాకు బయలుదేరుతున్నారు.

'రేపు ఫిజిక్సు పరీక్ష కదా ! .... చదువుకోవద్దూ ? ... సినిమా కెలా వెళ్ళగలుగుతున్నావు ?' అని ఆశ్చర్యపోయింది రాధ

'నీ కస్తమానం చదువుగోలే కాని, జీవితాన్ని అనుభవించాలన్న కోర్కె లేదు.' అంది సరళ రిక్షాకోసం కళ్ళతో గాలిస్తూ.

'అందుకు నువ్వే బాధ్యురాలివి .... ఏడాదిపాటు నీ స్నేహితురాలిగా ఉండి వారికి ఆనందం ఎక్కడ ఉండేది, ఎలా

దొరికేది అర్థం కాలేదంటే నువ్వు ఏమాత్రం శ్రద్ధ వహించ లేదన్నమాట! అన్నాడు రవణ. అతని పనామా ఉలెన్ పాంట్, టెరిలీన్ షర్ట్—సూర్యరశ్మిలో తళతళ మన్నాయి.

'సరే! .... అక్షింతలు నా నెత్తిన వేశావూ! ..... పద వమ్మా! రాధమ్మా! .... సినిమా చూద్దువుగాని.'

రాధ ఉలిక్కిపడింది. సరళ కంఠంలో హాస్యధోరణి ఏమాత్రం కనబడలేదు.

'నువ్వు చూసిరా! .... పరీక్ష లయ్యాక నేను చూస్తాను'

'ఒక్క మూడు గంటల కాలంలో మీరు చదివి ఆర్జించేది ఏమైనా ఉంటుందాని నాకు అనుమానంగా ఉంది. ముగ్గురం కలసి ఇంతకాలంగా ఒక్కసారి కూడా షోకి వెళ్లలేదు. ఈ ఒక్కసారి రండి. ఎంజాయ్ చేద్దాం' అన్నాడు రవణ విన యంగా. రాధ వద్దని వారించినా బలవంతంగా రిక్షాలో కూర్చోబెట్టి తీసుకుపోయారు. రవణను మధ్య కూర్చోబెట్టి చెరోపక్కా కూర్చున్నారు. సినిమా నడుస్తున్నంతసేపు రవణ ఏవేవో జోక్‌లు విసురుతూనే ఉన్నాడు. ఆ మూడు గంటలూ ముళ్లమీదున్నట్టు గడిపి రాధ బయటికొచ్చింది. ఇల్లు చేరు కునేసరికి తొమ్మిదైంది. సుభద్రమ్మ, రఘు అన్నం తిన కుండా ఆమెకోసం కాసుక్కూచున్నారు. రాధ భయంతో, సిగ్గుతో సతమతమైంది. ఆమె ఎక్కడకు వెళ్లింది, ఆలస్యం ఎందుకైంది ఎవరూ అడగలేదు.

'మీరు నాకోసం వేచివుంటారని తెలిస్తే ముందే వచ్చే దాన్ని' అంది రాధ.

'నువ్వు రాత్రి పన్నెండుకు వచ్చినా నీకోసం ఎదురు చూస్తూ కూర్చుంటాం. ఇది అయిష్టంతో చేసేపని కాదు గనుక—' అన్నాడు రఘు.

ఆ రాత్రంతా ఆమెకు సరిగ్గా నిద్ర పట్టలేదు. జీవిత రహస్యం దగ్గరకు వస్తున్నట్టనిపించింది. కలల్లో చిత్రమైన అనుభవాలు, రవణకూ తనకు పెళ్లి, రవణ బలవంతంగా తన సౌందర్యాన్ని స్వంతం చేసుకున్నాడు. ఇద్దరూ పెళ్లి చేసుకుని హాయిగా ఉంటుంటే ఓనాడు శేఖర్ తిరిగివచ్చి ఆమెను వచ్చేయమన్నాడు ...... అలా అర్థంలేని కలలు. ఆ మర్నాడు ఫిజిక్స్ పరీక్ష సరిగ్గా రాయలేకపోయింది.

ఆ మర్నాడు సాయంత్రం కూడా సరళ ఇంటికి వెళ్లింది. ఒక్క రవణ మాత్రం సోఫాలో కూర్చుని సిగరెట్టు కాలుస్తున్నాడు.

'రండి! .... రండి! .... సరళ ఇప్పుడే బయటికి వెళ్లింది. వచ్చేస్తుంది' అని ఆహ్వానించాడు. రాధ భయంలో దాక్కుంది. చిత్రమైన అనుభవా లుంటేనే జీవితం రక్తి కడుతుందని సరళ ఎన్నోసార్లంది. ఆమె సిద్ధాంతాలన్నీ ఒక్కొ ట్కొక్కటి వరుసగా జ్ఞాపకం వచ్చాయి. సిగ్గుతో నవ్వుతూ దూరంగా కూర్చుని చేతికందిన పత్రిక తీసి పేజీలు తిరగ వేసింది.

'నిన్న బలవంతంగా సినిమాకు తీసికెళ్లినందుకు కోపమా'

రాధ రవణకేసి చూసింది. కళ్లల్లో కొంటెనవ్వు. ఆవెనుక చీకటి నదులు—గుండెలు దడదడ కొట్టుకున్నాయి.

'అబ్బే! .... అలాంటిదేమీ లేదు.' అంది నవ్వటానికి యత్నిస్తూ.

'నేనూ, సరళ జీవితాన్ని పూర్తిగా అనుభ వించ దల్చుకున్నాం. మనం జీవించిఉండేది ఒక్క మూడు గంటలు. ఈ స్వల్పకాలంలో మన కోరికలమీద, ఆశలమీద ఎన్ని సెన్సార్లు చూడండి! .... ఎన్ని సంకెళ్లు చూడండి! .... ఈ సంకెళ్లు మనోబలం ఉంటే ఇట్టే తెగిపోతాయి. కట్టు బాట్లు, ఆచారాలు, నీతి నియమాలు మనం సృష్టించినవి. వాటిని మన కనుగుణంగా మార్చుకోవచ్చు..... ఏదో దేశంలో ఒకే భార్యకు ఎక్కువ భర్త లుండవచ్చునని సంఘం ఆమో దించిందిట. అది మన దేశంలో చెల్లుబడవుతుందా? .... అంటే, ఆచారాలు కనిపెట్టింది మనమే కాని, ఏ మహాశక్తి కాదు.'

రాధ కిదంతా అర్థం కాలేదు.

'మీ రిదంతా ఎందుకు చెప్తున్నారో నాకు తెలియటం లేదు.'

'మీరు మరోలా అనుకోకండి .... సరళ అంతా నాకు చెప్పింది. భర్త బుద్ధిలేక వదలిపోయినంత మాత్రాన బాధ పడ నక్కరలేదు. .... మర్చిపోయాను. కాస్త వోవల్‌టిన్ తాగండి' అంటూ ఫ్లాస్కులోంచి కప్పులో పోసి స్వయంగా ఆమె కందించాడు. రాధ తడబడుతూ అందుకుంది. రవణ ఆమె రెండో చేతిని మృదువుగా పట్టుకుని చెంపలు నిమి రాడు. గుండెలు వేగంగా కొట్టుకున్నాయి. ఆ క్షణంలో దేన్నీ ఎదిరించే స్థితిలో లేదు. నరాలన్నీ బలహీనమైపోయాయి. రవణ కళ్లల్లో నవ్వు ఆమెకు మరింత దగ్గరగా వచ్చింది. హఠాత్తుగా మెడ తడివి చూసుకుంది. మంగళసూత్రం లేదు. అవును. తనే తీసేసింది! ఇప్పుడదెలాఉంటుంది. ఆమె చేతిలో కప్పు నేలమీద పడి పగిలింది. రాధ తొందరగా లేచి బయటకు వచ్చేసింది.

'క్షమించండి .... సరళ మీ గురించి నాదగ్గర తప్పుగా అభిప్రాయ మిచ్చింది ....' అన్న రవణ మాటలు ఆమెకు సగం సగం మాత్రం వినిపించాయి.

త్వరత్వరగా అడుగులు వేయసాగింది. ఎక్కడకు వెళ్లేది ఆమెకే తెలియదు. మనసు మొద్దుబారి ఆలోచించడం మానేసింది. అతని నవ్వు, మాటల తీరు, ఇంకా హృదయ ఫలకంమీద చెదరకుండా అలాగే ఉన్నాయి. అదే నవ్వును ఆమె కొందరు అబ్బాయిల కళ్లల్లో చూసింది. ఆనాడు దాని వెనుక వుండే నిగూఢ రహస్యాన్ని ఛేదించలేక పోయింది. మూసిన గది తలుపుల్ని రవణ తెరిచి చూపించాడు.....

ఇంటికి వెళ్లబుద్ధివేసిందికాదు. ఏకాంతంగా కూర్చొని ఆలోచించి కొన్ని నిర్ణయాలు చేసుకోవలసుంది. తనలో ఏదో లోపం ఉంది... అలా నడుస్తుంటే పార్కు కనపడింది. కొంతదూరం వెళ్లేసరికి సరళ సిమెంటు బెంచీమీదకూర్చుని పక్కనే నిలబడున్న యువకుడితో ఏదో మాట్లాడుతోంది. రాధ ఆమె దృష్టిపథంనుండి తప్పించుకోలేకపోయింది.

'రండి రాధగారూ! .... ఈయన చలపతిగారు! ఫైనల్ బి. ఏ' అని పరిచయం చేసింది. అతను విష్

చేశాడు. అతనిలో కూడా ఆమెకు రవణ కనిపించాడు. చలపతి అయిదు నిమిషాలుండి వెళ్ళిపోయాడు. రాధ ఆమె పక్కనే మౌనంగా కూర్చుంది.

'ఏవిటి దీర్ఘంగా ఆలోచిస్తున్నావ్ ?'

'నువ్వు మీ అన్నయ్యతో నా గురించి ఏం చెప్పావ్ ?'

'చెప్పేందుకేం లేదు. అతనికి కళ్ళున్నాయ్. కోరిక లున్నాయ్. ఎదుటివారి మనస్సు కనుక్కునే తెలివితేట లున్నాయ్. అన్నీ అతనే గ్రహించుకోగలడు... ఈ చలపతి చాలా మంచివాడు సుమా ! ....'

రాధ ఆమెకేసి చురచుర చూసింది.

'అలా అనేందుకు నీకు సిగ్గుగా లేదూ ?'

దూరంగా కొత్త దంపతులు గామోలు నవ్వుకుంటూ నడచిపోతున్నారు.

'ఆ అదృష్టం మనిద్దరికీ లేదులే ! .... కృత్రిమంగా జీవిస్తూ అసత్యాన్ని సత్యమని, చీకటి వెలుగని, నీడను నిజమని నమ్మి హాయిగా ఉండమంటే ఎలా ?'

రాధ సమాధానం చెప్పక ఎటో చూస్తూ కూర్చుంది.

'ఈ పుస్తకం చదువుతావా ? ... ఆస్కార్‌వైల్డ్ నవల. గొప్పగా ఉంటుంది.'

రాధ పుస్తకం అందుకుని పేజీలు తిరగవేసింది. అందులో ఏదో ఉత్తరం కనపడింది.

'ఈ కవరు నీకే గామోలు ! .... ఏ ప్రేమలేఖో అయుంటుంది. నేను చూశానని ఎగిరిపడతావు .... ఇంద !' అంది పుస్తకంలోంచి కవరు తీస్తూ.

సరళ ఉత్తరం తీసి రెండు పంక్తులు చదివి 'ఇది నీ సొమ్ము—నాకు సంబంధం లేదు' అంది తిరిగి ఇచ్చేస్తూ. రాధ ఆశ్చర్యపోతూ ఉత్తరం చదువుకుంది. కళ్ళు ఎర్ర బడ్డాయి. పెదిమలు వణికాయి. శరీరంలో ప్రతి అణువూ అహంకారంలో వూగిసలాడింది. అవమానంతో తల వంచుకుంది. సరళ ఏమీ ఎరగనట్టు పక్కనే ఉన్న పూల మొక్కలతో ఆడుకుంటోంది. నేలమీద జారిపడ్డ గులాబీని తల్లో తురుముకుంది.

'నేలమీద పడితే పువ్వు అపవిత్రమై పోతుందట. ఏవిటో పిచ్చి శాస్త్రాలు. దుమ్ము దులిపేసి తల్లో పెట్టేకుంటే సరి ....' అంది స్వగతంగా.

'ఆ మాట నీ విషయంలో అక్షరాలా నిజం .... ఇంక నీ నాటకం చాలించు. నీ చాతుర్యాన్ని మెచ్చుకుని మెడలు విరిచేందు కిక్క డెవరూ లేకపోవటం శోచనీయం... చలపతి నాకు ప్రేమలేఖ రాశాడు. నా అందచందాల్ని ఆదిశేషువులా వర్ణించాడు. అతని సంగతి తరువాత కనుక్కుంటాను కాని, ఈ ఉత్తరం నీ పుస్తకంలో ఎలా వచ్చింది కాస్త చెప్తావా ?....'

సరళ కంగారుపడలేదు. రాధకేసి ప్రశాంతంగా చూసింది.

'రాధా ! .... నువ్వు అడ్డు ప్రశ్నలు వెయ్యనక్కర్లేదు. ఇది న్యాయస్థానం కాదు. చలపతి ఈ ఉత్తరం నీ కందచేయమని బతిమాలాడు. నేరుగా ఇవ్వటానికి నాకూ భయం వేసింది. అందుకని ఈపని చేశాను. అతను నీ కోసం ఏమైనా చేస్తానంటున్నాడు. ఇందులో నా తప్పేమీ లేదు.'

ఆమె తెగింపుకు రాధ తెల్లబోయింది.

'పరాయి ఆడదానికి—అందులోనూ పెళ్ళయిన దానికి ధైర్యంగా ప్రేమలేఖ రాసినందుకు చెప్పుతీసి కొట్టలేక పోయావ్ ? .... దీనికి నీ ప్రోత్సాహం కూడా ఉందని అనుకోమంటావా ?'

'తప్పకుండా అనుకో. నువ్వు పెళ్ళయిన దానివని అతనికేం తెలుసు ? నేను విధవనని ఎవరి కెరుక ? మన జీవితాలు రహస్యాలతో నిండిఉన్నాయి .... దాపరికం ఎందుకు ? నిజం చెప్తాను విను. నచ్చకపోయినా ఆలోచించి చూడు. చెడుగులో కూడా మంచితనం ఉంటుంది. మన జీవితాలు నిస్సారంగా ఎందుకుండాలి ? మనకు మాత్రం కోర్కెలు, ఉద్రేకాలు లేవా ? .... మనం చేయని తప్పుకు శిక్ష ఎందు కనుభవించాలి ? మా ఆయన్ని ఈ లోకం విడిచిపెట్టమని, మీ ఆయన్ని దేశంమీదకు పొమ్మని ఎవరు కోరారు ? నేను నీకు చాలా సార్లు చెప్పాను. మార్గాలు ఏవైనా, ఆనందించటమే మన ఆశయం. కవి పిచ్చిగా పాటలు రాస్తాడు—అదతని కానందం. ధనవంతుడు అతన్ని చూసి నవ్వుకుంటాడు. ఎందుకంటే అతని దృష్టిలో డబ్బు సంపాదించటం ఒక్కటే జీవితాశయం. చిత్రకారుడికి తన బొమ్మలే ప్రపంచం... కనుక ఆనంద మనేది. దాన్ని పొందే మనిషి అభిరుచులమీద ఆధారపడి ఉంటుంది కాని ఇతరుల ఇష్టాయిష్టాలమీద కాదు... కోర్కెలను అణచి ఉంచటం ప్రకృతికి విరుద్ధం. నాకూ ఎందరో ప్రేమలేఖలు రాశారు. ఎవర్నీ నేను తిరస్కరించలేదు. వాళ్ళందరూ నాకు కావాలి. నేను పోగొట్టుకున్న వస్తువు దొరికేదాకా ఇలా వెతుక్కుంటూనే ఉంటాను... మరో ముఖ్యవిషయం. నిన్ను విమర్శించేవారికి, దుయ్యబట్టేవారికి నీ స్థితి అర్థంకాదు. నీలో ఉన్న లోపాలు వారిలో లేవు. కనక వాళ్ళు మన జీవితాలను క్రొత్త కోణంలోంచి చూస్తారు.'

రాధ మాట్లాడకుండా వింది.

'అయితే సరళా ! .... ఇంతమందిని ఒక్కసారిగా ఎలా పెళ్లిచేసుకోటం ?''

సరళ ఫక్కున నవ్వింది.

'నే నింతవరకూ పెళ్లి గురించి ఆలోచించలేదు.'

'నీ సిద్ధాంతాల్ని ఒక్క వాక్యంలో చెప్పాలంటే, జీవితంలో ఓడిపోయిన స్త్రీకి మగవాడివలనే ఆనందం కలుగుతుందంటావ్—అవునా ? .... అన్న, చెల్లెలు ఒక్క తరగతికి చెందినవారే !'

సరళ సమాధానం చెప్పలేదు. చలపతి ఉత్తరాన్ని ఆమె పుస్తకంలోనే భద్రపరచి తిరిగి ఇచ్చేసి రాధ తిరుగుముఖం పట్టింది.

'పిచ్చిపిల్ల ! ......' అన్న సరళ మాటలు ఆమె చెవుల దాకా వచ్చి ఆగిపోయాయి. రాధ వెనక్కి తిరిగి చూడలేదు. చరచర నడచిపోయింది.

అన్వేషణలో ఓ అధ్యాయం ముగిసినట్టయింది.

ఇంటి కొచ్చేసరికి తల్లి కొడుకులు భోజనం చేయకుండా కూర్చున్నారు.

'ఏం రాధా ! .... నీ స్నేహితురాలు సరళ నిన్ను పట్టుకుని వదలటంలేదు. గావెూలు ! .... కాటు వేయగలదు— జాగ్రత్త !' అని నవ్వాడు రఘు.

'వేయబోయింది కాని తప్పించుకు వచ్చేశాను.'

*　　*　　*

కాలేజీకి వేసంగి సెలవులు—

రాధ మళ్లీ మారింది. సరళను కలుసుకోటం మానేసింది. ఆమె బోధించిన ఫిలాసఫీ తల్చుకునేసరికి భయం వేసేది. రెండు జెడల మాట పూర్తిగా మరచింది. మంచి మంచి చీరలు, జాకెట్లు పెట్టె అడుక్కి చేరుకున్నాయి. ఎవరితోనూ ఎక్కువగా మాట్లాడేది కాదు. అడిగిన ప్రశ్నలకు జవాబు చెప్పటంతో ముభావంగా ఉండిపోయేది. చిరునవ్వు వేసవి వర్షంలా ఎప్పుడో కాని ఉదయం కాదు. సుభద్రమ్మతో రోజూ గుడికి వెళ్లి వచ్చేది. సరళ అప్పుడప్పుడు కనిపించినా, చూడనట్టు మొహం తప్పించేది. రఘు ఆమె ప్రవర్తన గమనిస్తూ పూరుకున్నాడు కాని ఈ మార్పుకు కారణం అడగలేదు. జీవితంలో ఎన్నోసార్లు ఓడిపోయి ఆశాభంగం పొందితే కాని పరిపూర్ణత్వం సిద్ధించదు. సీనియర్ పుస్తకాలు కొనిచ్చాడు. అవన్నీ చదువుకుంటూ ఎక్కువ కాలం మేడమీద గదిలోనే ఉండేది రాధ.

అలా పదిహేను రోజులు గడిచాయి.

ఓనాడు సాయంత్రం రఘు 'రేపే విశాఖపట్నం ప్రయాణం' అన్నాడు.

సుభద్రమ్మ అర్థంకానట్టు చూసింది.

'అవునమ్మా ! మళ్లీ ట్రాన్స్‌ఫరైంది. ఈ రాత్రి బండికే వెళ్ళాలి. వారంరోజులుపోయాక మీరు వచ్చేయండి. రాధను అక్కడ కాలేజీలో చేర్పించాలి.'

'ఏం ఉద్యోగాలు ! .... ఏం ఉద్యోగాలు !'' అని విసుక్కుంది సుభద్రమ్మ.

రాధ నవ్వుకుంది.

వారం రోజులు పోయాక సరళ స్టేషనుకు, రాధకు వీడ్కో లివ్వటానికి వచ్చింది.

'నువ్వు పిలవకపోయినా వచ్చానని ఆశ్చర్యపోతున్నావు కదూ ! .... అదే మనలో గొప్పతనం ! నన్ను నువ్వు అసహ్యించుకుంటున్నావని నాకు బాగా తెలుసు. నా మీద నీకు ఎంతైనా కోపం ఉంటుంది. నేను ముందే చెప్పాను. ఒకరికి నచ్చిన జీవిత విధానం మరొకరికి నచ్చకపోవచ్చునని. నీ కిష్టమైతే నా మార్గాన్ని అనుసరించమన్నాను కాని బలవంత పెట్టలేదు. అంతమాత్రంచేత మన మధ్యఉన్న స్నేహితం చెడిపోతుందా ? మొదట్లో నువ్వు కూపస్థ మండూకంలా ఉన్నావు. తరువాత తరువాత ఆకర్షణీయంగా తయారై అందరి దృష్టిలూ నీవైపుకు తిప్పుకున్నావు. నువ్వు నా మతంలో చేరావని పారపాటు పడ్డాను. అంతేకాని ఎవర్నీ హింసించే స్వభావం నాకు లేదు. నన్ను క్షమించు రాధా ' అంది సరళ.

రాధ కళ్లల్లో నీళ్లు నిలిచాయి.

'చెడ్డపనులు చేసే మనుష్యులు అనుకున్నంత చెడ్డవాళ్లు కాదేమో !' అనుకుంది.

రాధ ఏదో అనాలనుకుంది కాని మాటలు పైకి రాలేదు. బండి కదిలిపోయింది. సరళ జేబు రుమాలు కదలిస్తూనే ఉంది.

*　　*　　*

విశాఖపట్నంలో రాధ జీవితం మూడు నెలలు సాఫీగా నడచింది. కాలేజీకి వెళ్లిరావటం, పాఠాలు చదువుకోటం, సుభద్రమ్మగారికి సాయపడటం, అంతకుమించి చెప్పుకోదగ్గ విశేషమేమీ లేదు. కాలేజీలో ఏ అమ్మాయితోనూ పరిచయాన్ని అవధి దాటనివ్వలేదు.

ఓనాడు హాల్లో ఎవరితోనో మాట్లాడుతూ రఘు రాధను పిలిచాడు.

'ఈయన మీ కాలేజీకి కొత్తగా వచ్చిన సంస్కృతం లెక్చరరు రంగనాథంగారు. తెలుగులో నీకు తెలియని విషయాలు అడిగితే వివరించి చెబుతారు. నాన్నగారు, ఈయన స్నేహితులు.'

రాధ నమస్కరించింది.

'మీ ఇంటి కెదురుగా ఉంటున్నా—ఎప్పుడైనా రావొచ్చు' అన్నా రాయన.

ఆయనకు నలభై ఏళ్లుంటాయి. తల పూర్తిగా నెరసిపోయింది. పొట్టిగా లావుగా ఉండే ఆయన్ని చూసేసరికి ఓవంక నవ్వు, మరోవంక గౌరవభావం ఏర్పడ్డాయి. కళ్లల్లో గంభీరత్వం-ఎంతటి కష్టాలనైనా ఎదుర్కొనే ధైర్యం కనిపించాయి.

ఆ సాయంత్రమే తెలుగు పుస్తకం తీసుకుని ఆయన దగ్గరకు వెళ్లింది.. రంగనాథంగారు వంటింటో పొయ్యి దగ్గర సతమత మవుతున్నారు. ఓ పదహారేళ్ల అబ్బాయి కూరలు తరుగుతున్నాడు..

'రామ్మా రా ! .... ఇది మా దైనందిన కార్యక్రమంలో ఓ ముఖ్యాంశం. కూర్చో !' అన్నారు రాధను చూసి.

'సారీ మేష్టారూ ! .... మరోసారి వస్తాను. మీకు తీరుబడి లేదు.' అంది రాధ.

రంగనాథంగారు నవ్వుతూ 'అలా చూస్తే మనకు విశ్రాంతనేది ఎప్పుడూ ఉండదు. హాల్లో ఉండు. ఇప్పుడే వస్తాను.'

రాధ హాల్లో కూర్చుని గోడమీది ఫొటోలు చూడసాగింది.

మరో అయిదు నిముషాలకు ఆయన వచ్చి కూర్చున్నాడు.

'పాండురంగ మాహాత్మ్యంలో కొన్ని పద్యాలు బొత్తిగా అర్థం కావటంలేదండి.' అంది పుస్తకం తెరుస్తూ.

'అవునమ్మా ! రామకృష్ణుని కవిత అలాంటిది. ఒక్కపాల్లు పదమైనా పద్యం రాస్తేనేకాని అతనికి తృప్తి ఉండదు.

అతని కట్టడం అందంగానూ, శాశ్వతంగానూ ఉంటుంది. అతని భావాలు అర్థంచేసుకోటం అంత సులభం కాదు.' అంటూ రాధకు తెలియని పద్యాలన్నీ చక్కగా వివరించి చెప్పారు.

'అది మీ అబ్బాయాండి ? .... ' వంటింట్లోకి చూస్తూ అడిగింది.

'అవునమ్మా ! .... తల్లిలేని పిల్లాడు. అతనిమీదే నా ఆశలు పెట్టుకున్నాను. నా సర్వస్వం అతనే. అతన్ని బాగా చదివించి ఉన్నత స్థితిలోకి తీసుకురావాలి. అదొక్కటే నా జీవితాశయం. అతను ఔన్నత్యాన్ని అందుకున్ననాడు నేను తృప్తిగా కన్ను మూయగలను. ప్రస్తుతం మెట్రిక్ చదువుతున్నాడు.'

రాధ ఆయన ప్రక్కనే ఉన్న షెల్ఫులో ఉన్న పుస్తకాల కేసి చూసింది.

భాగవతం, భగవద్గీత, భారత రామాయణాలు, శివానందుని బోధనలు, వివేకానందుని గ్రంథాలు, అరిస్టాటిల్, హెూవ్స్—వీరి సిద్ధాంతాలు అన్నీ వరుసగా ఉన్నాయి.

'జీవితంలో ఆనందం కావాలంటే ఈ పుస్తకాలు చదవాలి. వీటిలో ఉండే భావాలను చదివి జీర్ణించుకున్ననాడు మనకు మనమే కొత్తగా కనిపిస్తాం. శిఖరంమీద నిలబడి తలిమా మనుష్యులను చూసి జాలిపడతాం.'

రాధ శ్రద్ధగా వింది. ఆమె అన్వేషణకు మరో మార్గం దొరికినట్టయింది.

'పుస్తకాల్లో మనశ్శాంతి ఎలా దొరుకుతుంది మేష్టారూ?'

'తప్పకుండా దొరుకుతుంది. ముఖ్యంగా నీలో ఉండే అశాంతి నశిస్తుంది.'

'అంటే ?'

'కంగారు పడకు. రఘు నీ గురించి నాకంతా చెప్పాడు. మీ ఆయన నిన్ను వదలిపోయినంతమాత్రాన జీవితం వృథా కాదు. మన కనువైన మార్గాన్ని వెతుక్కోవాలి.'

'ఆడంబరంగా, నలుగుర్నీ ఆకర్షిస్తూ తిరిగితే శాంతి దొరుకుతుం దనుకుంటూ .... ' రంగనాథంగారి అభిప్రాయం తెలుసుకుందామనే ఈ ప్రశ్న వేసింది.

'అక్కడే నువ్వు పొరబడుతున్నా వమ్మాయ్. మనసు నిర్మలమైన తటాకం లాంటిది. కాని మానవుడు దా న్నలా ఉండనీయడు. కొన్ని జలజంతువుల్ని తీసుకొచ్చి పడేస్తాడు. మరీ అందంగా, సజీవంగా చేద్దామని ఉద్దేశ్యం .... కాని, కాలక్రమేణ ఏమవుతుంది ? పెరిగి పెద్దవై స్వచ్ఛతను సంహరిస్తాయి .... కనక నిర్మలంగా సృష్టించబడిన ఆత్మను అలాగే ఉండనీయి. దానికి నగిషీలు వద్దు. అలంకరణలు వద్దు ..... ఉద్రేకాలనుండి దూరంగా ఉంచు. అందుకు సాధనాలు ఈ పుస్తకాలు. చదివి జీవితాన్ని క్రమబద్ధం చేసుకో. నేనూ ఈ మార్గాన్ని ఆచరించి ఫలితం పొందుతున్నా.'

రంగనాథంగా రిచ్చిన పుస్తకం తీసుకుని ఆమె ఇంటికి వచ్చింది.

ఆ మర్నాటినుండి చదవటం మొదలుపెట్టింది. తరుచు ఆయున్ను కలుసుకుని కొత్త విషయాలు తెలుసుకుంటూ ఉంది. అందులో భావాలు, తికమకలు పూర్తిగా అర్థం కాక పోయినా, పట్టుదలగా ముమ్ముందు అవగాహ నవుతుందని చదువుతూనే ఉంది. ఒక్కోసారి విసుగెత్తి విసిరి కొట్టేది. మరుక్షణం తన పొరపాటుకు పశ్చాత్తాపపడి శ్రద్ధగా ప్రయత్నించేది.

అలా రెండు నెలలు గడిచాయి.

రంగనాథంగారు బోధించినట్టు ఆమెకు శాంతి లభించలేదు. రాజ్యాలు, భోగాలు, విలాసాలు అశాశ్వతమని ఒకవంక బోధిస్తూ, భార్యలకోసం, భోగలాలసత్వం కోసం అర్జునుణ్ణి శ్రీకృష్ణుడు యుద్ధానికి పురికొల్పటం ఆమెకు వింతగా కనపడింది. రంగనాథంగారితో ఇలాంటి సందేహాలకు సమాధానం అడిగితే 'కష్టాలు ఎదుర్కొన్నప్పుడు వీటి విలువ అర్థమౌతుంది.. అంతవరకూ తమాషాగానే ఉంటాయి.' అనేవారు.

ఉన్నట్టుండి ఆయన కొడుకు మంచాన పడ్డాడు. టైఫాయిడ్ వీరవిహారం చేసింది. రంగనాథంగారు దిగులుతో మంచందగ్గర కూర్చుని తన జీవితంలో దీపం ఆరిపోకుండా నిలబెడుతున్న కొడుక్కేసి చూసేవారు. రాధకు ఎంతో జాలి వేసేది. ఏవైనా పుస్తకాలు చదువుతే బాధ ఉండదని చెప్పి చూచింది. ఆయన బోధించిన జీవిత సూత్రాలు ఆయనకే వెగటు కలిగించాయి. ఒకనాటి ఉదయం ఆశాజ్యోతి ఆరి పూరుకుంది.

రంగనాథంగారు అనుకోనంతగా మారిపోయారు. ఎప్పుడూ పరధ్యానంగా ఉండేవారు. క్లాసులో అసందర్భంగా ఏవేవో అనేవారు. ఒక పాఠంలోంచి మరో పాఠానికి దాట్లు వేసేవారు. ఆయన క్కలిగిన విఘాతాన్ని వూహించి విద్యార్థులు కొంతకాలం పూరుకున్నారు. కాని ఎన్నాళ్ళు ఈ అవకతవకలు సహిస్తారు ? అల్లరి చేసేవారు. బల్లలమీద మృదంగం వాయించేవారు. ఓనాడు ప్రిన్సిపాలు ఆయన్ని రాజీనామాచేసి పొమ్మని కోరారు.

ఆయన స్వగ్రామం వెళ్లే రోజున రాధను రమ్మని కబురంపారు. రాధకు ఆయన్ని చూసేసరికి భయం, ఏడుపు వచ్చాయి. బాగా చిక్కిపోయారు. జుట్టు మరింత తెల్లబడింది. ఆయన కొడుకు వంటగదిలో ఇంకా కూరలు తరుగుతున్నట్టే ఉంది.

'వచ్చావా!....రా! ....కూర్చో!.. ఈ సాయంత్రం బండికి నేను మా స్వగ్రామం వెడుతున్నా.. నువ్వు కాలేజీనుండి తిరిగి వచ్చేసరికి నే నిక్క డుండను. వెళ్లేముందు ఒక్క విషయం నీకు చెప్పదల్చుకున్నా. అనుభవంమీద కాని మనిషికి నిజానిజాలు తెలియవు. వాస్తవికతను ఎదుర్కొంటేనే కాని లోతులు తెలియవు. జీవితాన్ని నిరాడంబరంగా, మనసును పరమాత్మలో ఐక్యంచేసి సుఖించాలని ఓనాడు నీకు బోధించాను. అదే నీ బాధను అణచి మనశ్శాంతి కలిగిస్తుం దన్నాను. కాని రాధా ! అది నిజంకాదు. కొడుకు పోయేసరికి ఏ వేదాంత గ్రంథమూ న న్నూరడించలేక పోయింది. అంతా వట్టి బూటకమని, మాటల గారడీ అని అనిపించింది. కనుక ఈ మిధ్యాబింబాలను నమ్మి మోసపోకు. నీకు ఆనందాన్ని, తృప్తిని కలిగించే మార్గం

మరొకచోట ఉంటుంది. 'ఫలానా' అని నిర్ణయించి చెప్పే శక్తి నాకు లేదు. అన్వేషిస్తే నీకే లభ్యమౌతుంది. బుద్ధిగా చదువుకో.'

రాధ కళ్లల్లో నీళ్ల నిలిచాయి.

'మీ పుస్తకాలు రెండు నా దగ్గ రున్నాయి. తీసుకు వస్తాను' అంది.

'వద్దమ్మా ! .... వద్దు ! వాటితో నా కెలాంటి ప్రమేయమూ లేదు. ఏట్లో విసిరేయి' అన్నారు.

ఆయన ముఖంకేసి చూడలేకపోయింది.

*        *        *

రాధ మళ్లీ యాంత్రిక జీవితంలో పడింది. రోజులు, నెలలు దొర్లిపోయాయి. ఆమెకు కాలేజీలో చాలా బిరుదాలు దొరికాయి. 'బట్టీ యంత్రం' అని, 'మట్టిముద్ద' అని, 'యోగిని' అని—అన్నింటినీ సహించి నవ్వి వూరుకుంది.

ఓనాడు రఘు జ్వరంతో పడుకున్నాడు. రెండోరోజు కూడా తగ్గకపోయేసరికి రాధ దగ్గర్లోవున్న లేడీ డాక్టరును తీసుకురావటానికి వెళ్లింది.

డిస్పెన్సరీలో చాలామందున్నారు. డాక్టరమ్మ ఎక్కడికో విజిట్‌కి వెళ్లింది. రాధ ఖాళీగా ఉన్న కుర్చీలో కూర్చుని రోగుల వంక చూసింది. చిన్నపిల్లల దగ్గర్నుంచి ముసిలివాళ్ల దాకా సమస్త వయస్కులూ ఉన్నారు. ఆలోచించగా, ఆలోచించగా ఇంతమంది ఒక్క వ్యక్తికోసం, ఆమె పరీక్షకోసం వేచిఉండటం ఆశ్చర్యంగా కనపడింది.

'ఈ డాక్టరమ్మ చాలా మంచిది. ఆమె చేతి చలవ కూడా అంతే. మావాడికి వళ్లు చల్లబడి మంచంమీద నుండి దింపే స్థితి వచ్చింది. ఈవిడ చేయి పడగానే వెచ్చదనం వచ్చేసింది. అందుకే, మావారు ఏమాత్రం అనారోగ్యం ఉన్నా ఇక్కడకే పరుగెత్తు కొస్తారు.' అంటోంది ఒకామె. మిగిలినవాళ్లందరూ వింటున్నారు. మరో ఇద్దరు, ముగ్గురు తమ తమ అనుభవాలు వర్ణించారు.

డాక్టరమ్మ వచ్చేసరికి సంభాషణ ఆగింది.

నవ్వుతూ ఒక్కొక్కర్నే పరిశీలించింది. దాపరికం లేకుండా తమ తమ బాధల్ని తెలియజేశారు. అడిగిన ప్రశ్న లన్నింటికీ విసుక్కోకుండా జవాబు లిచ్చారు. కొందరికి మందులు, కొందరికి ఇంజక్షన్లు—ఓ పదేళ్ల అబ్బాయి సిరెంజి చూసి జడుసుకుని ఏడుపు లంకించుకుంటే, అతన్ని వూరడించి బాధనేది లేకుండా సూది పొడిచింది. ఆమె ఓర్పుకు, చాకచక్యానికి రాధ విస్తుపోయింది. డాక్టరమ్మ స్థానంలో తనువున్నట్టు వూహించుకుంది. శరీరం గగుర్పొడిచింది. మనసంతా వెలుగుతో, ఆనందంతో నిండిపోయింది. ప్రతిరోజూ వందమందికి శారీరక సౌఖ్యాన్ని ప్రసాదించ గలుగుతోంది తను.

పిలవగానే రాధ వెళ్లింది. రఘుకుజ్వరంగా ఉందని, రమ్మని కోరింది.

'మీ రీవూరు కొత్తగా వచ్చారా?....' అనడిగిందిడాక్టరమ్మ.

'అవునండి .... ఆరునెల్లు కావస్తోంది.'

'నువ్వు ఏం చేస్తున్నావ్ ? మీ అన్నయ్య ఏం ఉద్యోగం చేస్తున్నారు ?'

రాధ వివరించింది.

మరో పది నిముషాలకు ఇద్దరూ ఇల్లు చేరుకున్నారు. పరీక్షించి ఓ ఇంజక్ష నిచ్చింది. మందుకోసం రాధను సాయంత్రము రమ్మంది.

రఘు జ్వరం మూడు రోజుల్లో తగ్గిపోయింది. అయినా రాధ డాక్టరమ్మను రోజూ కలుసుకుంటూనే ఉన్నది. ఆమెక్కూడా రాధంటే ఆప్యాయత ఏర్పడింది.

'ఎప్పుడూ బిజీగా ఉంటారు. ఈ సహనం మీ కెలా వచ్చింది ?' అనడిగింది ఓనాడు రాధ.

డాక్టరమ్మ నవ్వింది.

'డాక్టరుకు కావలసింది సహనం. అది క్రమేణ అలవడుతుంది. నామీద ఆశలు పెట్టుకుని బోలెడు రోగులు వస్తారు. తియ్యగా, అర్థమయ్యేటట్టు మనం మాట్లాడితే సగం రోగం మాయమైన ట్టనిపిస్తుంది. మానసిక బలం కలుగుతుంది. ఈరకం బలాన్ని ఎదుటివారిలో కలిగించాలంటే సహనం అవుసరం. ఎవరికీ ఆశాభంగం కలుగకూడదు.'

రాధ ఏదో ఆలోచించి 'డాక్టరుగారూ ! .... అస్తమా. ం రోగులు, మందులు—వీటితో మీకు జీవితం విసుగెత్తటం లేదూ ?' అనడిగింది.'

ఆమె రాధకేసి చిత్రంగా చూసింది.

'ఎన్నటికీ కాదు రాధా ! .... '

'ఆ మందులవాసన వింటేనే నాకు పడదండి.'

'కాని వాటిలోనే జీవితాన్ని రక్షించే రహస్యం ఉందని మర్చిపోతున్నావు. కొడుకు ప్రమాదావస్థలో ఉన్నాడనుకో. తలిదండ్రులు అతన్ని గారాబంగా పెంచివుంటారు. అతనికోసం గొప్ప భవిష్యత్తు వేచివుందని ఎదురు చూస్తూంటారు. తల్లి ఏడుస్తుంది. గుండెలు బాదుకుంటుంది. ఆమెలో చెలరేగే ఆవేదనను ఎవరూ వూహించలేరు. మాటల్తో అర్థమయ్యేట్టు వివరించి చెప్పలేరు. అలాంటి కొడుకును రక్షించావనుకో. తలిదండ్రులు ఆనందబాష్పాలు రాలుస్తూ నమస్కరిస్తారు.... ఆ ఖ్యాతి నీది—అతని ప్రాణాన్ని రక్షించిన కీర్తి నీది. అప్పుడు నీ క్కలిగే ఆనందం, తృప్తి మరెప్పుడూ కలుగదు. వాళ్లతో కలిసి నువ్వుకూడా ఆనందబాష్పాలు రాలుస్తావు. అలాగే భర్తను బతికించి భార్యను సుమంగళిగా ఉంచటం, తల్లిని బతికించి కొడుక్కి శాంతి కలిగించటం—ఇవన్నీ నిన్ను విసుగెత్తించవు. నీకున్న శక్తిని సద్వినియోగం చేయటానికి సహకరిస్తాయి.

రాధ నిట్టూర్చింది. ఇంటికి తిరిగి వస్తుంటే మనసు కొంచెం తేలికైన ట్టనిపించింది. డాక్టరమ్మ చెప్పిన మాటల్ని, వర్ణించిన దృశ్యాలను పదే పదే మెదడులో మెదలింపజేసి, వాటికి ప్రాణంపోసి ఆనందించింది.

'అవును. ఆమె చెప్పే మాటలు అక్షరాలా నిజం.' అని పదే పదే అనుకుంది.

ఆ మర్నాడు డాక్టరమ్మ రాధను తన ఇంటికి తీసుకపోయింది. పదేళ్ల అమ్మాయి ఏవో పాఠాలు చదువుకుంటోంది. పనిమనిషి వంటింటో వంట చేస్తోంది.

'మా అమ్మాయి. నాలుగో తరగతిలో ఉంది. ఈమె రాధ' అంది డాక్టరమ్మ.

ఆ అమ్మాయి చేతులు జోడించి 'నమస్కారమండి!' అంది. రాధకు ఎంతో ముచ్చట వేసింది. ఆ చిన్నపిల్లలో ఎంతటి క్రమశిక్షణ! ఆమెను పరిపూర్ణ వ్యక్తిగా చేసేందుకు తల్లి కట్టిన మొదటి మెట్టు!

'మీరు అదృష్టవంతులు డాక్టరుగారూ!'

'కాదు రాధా! .... దురదృష్టాన్ని అదృష్టంగా మార్చటానికి యత్నిస్తున్నాను. దానికి నాన్నలేరు.'

రాధ కెదురుగా డాక్టరమ్మ పెళ్లి ఫోటో ఉంది. అనాటి నవ్వు, భర్త పోయాక కూడా ఆమె పెదవులమీద అలాగే ఉంది.

'మొదట్లో ఏడుస్తూ కూర్చున్నా, తరువాత తరువాత ధైర్యం కలిగింది. వైవాహిక జీవితం గొప్పదే! .... భర్త వలన ప్రేమను, సంతానాన్ని ఆశించని స్త్రీ ఉండదు. కాని ఆమెకా భాగ్యం లేనంతమాత్రాన తలుపులు మూసుకోవు. ఆనంద మనేది ఓ పెద్ద భవనం అనుకో—దాన్ని చేరుకోటానికి మార్గాలు అనేకం. అందులో ఒక్క మార్గం పెళ్లి చేసుకుని, పిల్లల్ని కని సుఖంగా ఉండటం. ఆ తోవంట వెళ్ల లేకపోతే మరోదారి—గతించిన సంభవాల్ని తల్చుకుని ఏడుద్దామనుకున్నా, తీరిక దొరకటంలేదు.'

'భర్త పోయినప్పుడు మీకు ఆత్మహత్య చేసుకోవాలనిపించలేదా?' రాధ ఒక్కొక్క ప్రశ్న ధైర్యంగా అడిగేస్తోంది.

'కలిగింది. కాని వివేకానందుడు ఏమన్నాడో తెలుసా? మనం జీవించేది కేవలం మనకోసమే కాదు. ఇతరుల కోసం కూడా .... నువ్వు ఇంటరు పూర్తికాగానే మెడిసిన్ చదువు — అదే నీకు సరైన మందు. మనశ్శాంతి దొరుకుతుంది .... ఏం? .... కంగారు పడుతున్నావ్? నీ జీవితచరిత్రంతా నాకు బాగా తెలుసు. మీ అన్నయ్య చెప్పాడు నాకు.'

రాధ సెలవు తీసుకుని ఇంటికి వచ్చేసింది.

మనసు ఆనందంతో గెంతులు వేసింది.

ఆమె అన్వేషణ ముగిసిందనిపించింది.

డాక్టరమ్మకు మనసారా కృతజ్ఞత చెప్పుకుంది.

*　　　*　　　*

రాధ ఇంటరు ఫస్టు క్లాసులో ప్యాసైంది.

రఘు ఆమెను మెడికల్ కాలేజీలో చేర్పించాడు.

హఠాత్తుగా అతనికి మళ్లీ కాకినాడ ట్రాన్స్‌ఫరైంది.

'ఏమో అనుకున్నాను కాని, భూప్రదక్షిణ యోగం తప్పకుండా ఉంది మనకు' అని విసుక్కుంది సుభద్రమ్మ.

ఆ రాత్రి రాధ ఒంటరిగా గదిలో కూర్చుంది. రఘు ఇదివరకటి ఇల్లు ఖాళీగా ఉందేమో చూట్టానికి వెళ్లాడు. సుభద్రమ్మ హరికథ వినటానికి వెళ్లింది. పన్నెండుదాకా ఆమె తిరిగి రాదు. కిటికీలోంచి వెన్నెల గదిలోకి జారుతోంది. చల్ల గాలి హాయిగా సంగీతం పాడుతూ అందర్నీ పలకరించి కదిలి పోయింది. నక్షత్రాలు చందమామ అందానికి అసూయతో కళ్లు చిట్లిస్తున్నాయి.

రెండేళ్లక్రితం ఉన్న అశాంతి, అస్థిరత్వం ఆమెలో మరి లేవు. చీకూ చింతా లేకుండా ఉన్న తన్ను శేఖర్ చీకట్లోకి విసిరేశాడు .... రఘు తన కడ్డంగా నిలబడి 'ఆత్మహత్య తగదు .... అన్వేషించి నీ కనుగుణమైన మార్గం కనుక్కో' అన్నాడు. ఒకరు టార్చిలైటు వేసి 'ఇదే సిసలైన వెలుగు' అన్నారు. మరొకరు చీకటిని చూపించి 'ఇందులో కూర్చుంటే ఏ బోధా ఉండదు.' అన్నారు. మూడో వ్యక్తి రెండడుగులు ముందుకువేసి 'మూసివున్న తలుపు తెరిస్తే సూర్యుడు వెలుగు కనిపిస్తుంది' అన్నారు. ఆశయం ఒక్కటైనా మార్గాలు వేరు. దైవాన్ని పొందటం ప్రధానంకాని మార్గాలు కాదన్నారెవరో. కాని జీవిత విషయంలో మాత్రం అవలంబించే మార్గమే ప్రధానం. ఒక వస్తువు కావాలనుకుంటే పొందేందుకు మార్గాలు చాలా. మోసగించి దొంగలించవచ్చు. బలవంతంగా లాక్కుపోవచ్చు. కష్టపడి డబ్బు సంపాదించి కొనుక్కోవచ్చు. వీటిలో మార్గం ప్రధానంకాని వస్తువును పొందటంకాదు.

అలా ఆలోచిస్తుండగా రెండు జెడలు వేసుకుని, చిత్రంగా నవ్వుతూ సరళ కనిపించింది. రాధ ఉలిక్కిపడింది. ఆమె సౌందర్యం రోజు రోజుకూ నాజూగ్గా తయారై మగవార్ని ఆకర్షించి ఆడిస్తుంది. క్రీగంటి చూపుతో, సంపుం, ఆచారాలు, కట్టుబాట్లు అన్నీ కరిగిపోతాయి. చలపతిలాంటి వ్యక్తు లందరూ ఆమె 'హుకుం' కోసం ఎదురుచూస్తూ చేతులు కట్టుకుని వరుసగా నిలబడతారు.

కాని ఈ జీవితం ఎంతకాలం నిలుస్తుంది?

యౌవనం ముసిలిదై మూల కూర్చుంటుంది .... కాని చలపతి మీసాలకు, తలకు రంగు రాసుకుని మరింత అందంగా కనపడటానికి యత్నిస్తాడు. మరో అమ్మాయిని 'లవ్' చేస్తాడు. సరళ పిలిచి 'బహు ప్రేయసి వ్రతం' తగదని బోధిస్తుంది.....అదో ప్రపంచం. అదో ఆనందం.

సరళ అప్పుడప్పుడు అన్న మాటలు వరుసగా జ్ఞప్తి కొచ్చాయి.

కాలేజీ చదువు వట్టి దండగ! కొత్తకొత్త అనుభవాల కోసమే అక్కడకు వెళ్లటం, కొన్ని నియమాలు, కట్టుబాట్లు, ఆచారాలు వివాహాన్ని సృష్టించాయి. అవన్నీ సవ్యంగా ఉన్నంత కాలం వాటిలో పవిత్రతను గౌరవించాలి .... కట్టుకున్న మగాడు అన్నింటిని కాలదన్ని వెళ్లిపోతే అది అపవిత్రమై పోతుంది. కొత్త జీవితంలో గతస్మృతు లుండకూడదు. ఎండమావుల కోసం వెతికేకంటె దొంగచాటుగా మామిడిపళ్లు తినటం మేలు. జీవితం ఆనందించేందుక్కాని, ఆశయాలతో ఉండేందుక్కాదు.

ఆమె ధైర్య సాహసాలు కూడా మరుపురానివి. వెళ్లిపోతున్న ఇంగ్లీషు లెక్చరరుని కల్పనాశక్తితో ముఖస్తుతి చేయటం, శేఖర్‌ని చూసీ చూడడంతో ప్రేమించానని చెప్పుకోటం—చలపతిని, రవణను తనకోసం పడి ఏడ్చేట్టు చేయటం, అన్నిటికంటె విధవగా ఉండి కూడా పెద్ద బొట్టు పెట్టుకొని చేతులనిండా గాజులు తొడుక్కొని చిరునవ్వుతో తిరగటం.

# అన్వేషణ

గడియారం పదకొండు కొట్టింది.

రంగనాథంగారు దీనంగా చూస్తూ నిలబడ్డారు.

పాపం ! ఆయన నమ్ముకున్న సిద్ధాంతం ఆయన కెందుకూ కొరకాకుండా పోయింది. శరీరంలో ఇంద్రియాల తిరుగుబాటును అణచివుంచా లంటా డాయన. అంటే, తన రాజ్యంలో విప్లవం చెలరేగుతున్నా, రాజు చూస్తూ వూరుకోవా లన్నమాట. ఎందుకంటే, బలంతో దాన్ని అణచలేడు కనక— కొడుకులో ఆయన ఆశలన్నీ రూపొంది నిలిచాయి. అతను పోగానే ఆయన జీవిత మార్గాలు కదలటం మానుకున్నాయి.

రఘును గురించి రాధ ఆలోచించలేకపోయింది. అతని ఔన్నత్యాన్ని కొలిచేందుకు కొలబద్ద లభ్యంకాదు. ఈ బాధ్య తను అత నెందుకు వహించాడో ఆమె కీనాటికీ అర్థంకాదు.

ఆలోచనలు నిలిచిపోయేసరికి సుభద్రమ్మ తలుపు తట్టింది.

లోపలికి వస్తూ ఆమె రాధను తదేక దీక్షతో రెండు నిమిషాలు చూసింది.

'రాధా ! .... నీ కళ్లు చిత్రంగా మెరిసిపోతున్నాయే' అంది ......

ఆనాడు రాధ కన్నీరు ఆగిందికాదు.

రఘు తల్లితో కాకినాడ వెళ్లిపోతున్నాడు.

'రాధా ! .... నీ అన్వేషణ పూర్తయి సరైన సమాధానం దొరికిందనుకుంటాను.'

'అవు నన్నయ్యా ! .... దొరికింది' అని అనలేక అంది.

'పిచ్చిపిల్లా ! .... అలా ఎందు కేడుస్తావు ? కాకినాడ ఏమంత దూరమని ? నీ యోగక్షేమాలు కనుక్కుంటూనే ఉంటాం. హాస్టలులో ఉండి చదువుకుందికి ఇంతగా బెంబేలు పడితే రేపు డాక్టరమ్మ ఎలా అవుతావ్ ?' అని వూరడించింది సుభద్రమ్మ.

బండి కదిలిపోయింది.

రాధ మాత్రం స్టేషనులో మిగిలింది.

* * *

ఇల్లంతా బావురుమన్నట్టుంది. రాధ మేడ మెట్లు దిగుతున్నట్టు, సుభద్రమ్మతో ఏదో వాదిస్తున్నట్టు, గట్టిగా పాఠం చదువుతున్నట్టు, రకరకాలుగా ఆలోచించుకుని రఘు బాధపడ్డాడు. దూరమయ్యేకొలది మనిషి ఆవశ్యకత, గొప్పతనం తెలుస్తాయి. రఘు సిగరెట్టు కాలుస్తూ కిటికీ దగ్గర కూర్చున్నాడు. సుభద్రమ్మ ఎక్కడికో వెళ్లింది. రాధ ఒంటరిగా ఉండలేక తిరిగి వచ్చేస్తుందేమోనని అతనికి భయం గానే ఉంది.

దూరంగా వస్తున్న వ్యక్తిని చూసి రఘు ఉలిక్కి పడ్డాడు. తొందర తొందరగా వీధిగుమ్మంవేపు పరుగెత్తాడు.

'రావోయ్ ! రా !' అనరిచాడు ఆనందంతో.

మరుక్షణం మిత్రు లిద్దరూ గాఢాలింగనంలో మునిగి పోయారు.

శేఖర్‌కేసి చూశాడు రఘు. బాగా చిక్కిపోయాడు. జుట్టు పల్చబడింది. శరీరం కొద్దిగా నల్లబడింది. కళ్లు బాగా లోతుకు పోయాయి. పెదవులమీద చిరునవ్వు మాత్రం అలాగే ఉంది. వచ్చీ రావటంతో సిగరెట్టు వెలిగించాడు. రఘు ఆశ్చర్యపోయాడు.

'ఈ అలవాటు ఎంతకాలం నుండి నాయనా ?'

'క్రితంసారి మిమ్మల్నందర్నీ వదలిపోయిన నాటినుండి.'

రెండు నిమిషాలు వారిమధ్య మౌనం నిలిచింది.

'శేఖర్ ! .... మనిషి సగమైపోయావు .... వడగళ్ల వానలో నడచివచ్చినట్లుంది. నీ టి. బి ?'

శేఖర్ విరగబడి నవ్వాడు. సిగరెట్టు పొగ ముక్కు పుటాల్లో దూరి నానా రభసచేసి దగ్గులో శరణ్యమంది.

'టి. బి. లేదు .... ఏం లేదు .... నువ్వు నా ఉత్తరాన్ని నమ్మావని నే ననుకోను కూడా. బి. ఎల్. చదివి వెల్‌ఫేర్ ఆఫీసరుగా ఉంటున్న నువ్వు ఈ చిన్న విషయంలో బోల్తా పడతావని నే నెన్నడూ వూహించలేదు.'

'నేను మోసపోలేదు శేఖర్ ! .... ఎందుకంటే, ఓనాటి ఉదయం నువ్వు ఇంగ్లీషు లెక్చరరుగా ఈవూరి కాలేజీలో చేరి మూడోనాడు అదృశ్య మయ్యావు. ఆ ఉదంతం తెలిసిన నేను నీ ఉత్తరాన్ని నమ్మను....'

శేఖర్ ఏదో అడగటానికి ప్రయత్నిస్తున్నాడని రఘుకు తెలుసు. రాధ విషయం తప్పించి అతను తెలుసుకోవలసిం దేముంది ?

'మద్రాసులో, వెనక నువ్వు వదలిపోయిన సుందరి తిరిగి దొరికిందా నీకు ? .... లేక ఆమెకోసం ఇంకా అన్వేషిస్తూనే ఉన్నావా ?'

రఘు గంభీరంగా నవ్వి 'లేదు ....' అన్నాడు.

అడుగుల చప్పుడు విని వీధి గుమ్మంకేసి చూశాడు— పనిమనిషి.

ఆనాటి కామెను వెళ్లిపొమ్మన్నాడు. సుభద్రమ్మ రాకుండా ఉండాలని మనసులో పదేపదే అనుకున్నాడు.

'ఏమయ్యా రఘుశ్రీ ! .... రాధ అందంగా లేదూ ? సగం మూతపడి, స్వప్నజగత్తులో విహరిస్తున్న నేత్రాలు. మాధుర్యం, మమకారం, ప్రేమ, అన్నింటిని ఒక్క ఎర్ర గీతలో యిముడ్చుకున్న పెదవులు. పొడుగాటి జెడ. ఆమె సౌందర్యానికి ధర కడుతూ కూర్చుంటే కాలానికి కొలత లేదు.'

'శేఖర్ ! .... నీ భార్య సౌందర్యాన్ని నువ్వు మెచ్చుకోటం, బాహాటంగా పొగడటం ,ఒకవిధంగా బాగానే ఉంది. కాని దాని మీద నా అభిప్రాయం అడగటం సభ్యతకాదు. అంత అందంగా

ఉన్న అమ్మాయిని నువ్వు అకారణంగా ఎందుకు వదలిపోయావో ఈ వాడైనా తెలుసుకోవచ్చా.'

శేఖర్ లేచి కిటికీ దగ్గరకు వెళ్లి ఆకాశంలోకి చూచాడు. తిరిగి వచ్చి 'ఆ కారణం ఈపాటికి నీకు తెలిసే ఉంటుంది' అన్నాడు.

'అయినా, నీ నోటంట వినాలనుంది. నీకు తెలిసిందే నాకు తెలుసని అనుకోటంకంటె బాహాటంగా చెప్పుకోటం మంచిదికదూ ?'

'రఘు ! .... నీ నాటకం చాలించు. ఆమె నువ్వు మద్రాసులో వదలివచ్చిన ప్రేయసి కావటమే కారణం. నీ సుఖానికి అడ్డు రావటం నా కెంతమాత్రమూ ఇష్టంలేదు. నే నసలు ఇక్కడకు రాకపోదును. కాని రాధను నువ్వు పెళ్లి చేసుకోలేదని, చదివిస్తున్నావని విన్నాను. అంతేకాక, కనపడిన ప్రతి మగాడితోనూ తిరగమన్నావట. ఆమాత్రం ధైర్యంలేనివాడివి 'ప్రేమ—ప్రేమం' టూ ఎందుకు అఘోరిస్తావు ? .... పిరికి పందవని ఒప్పుకోకూడదూ ?'

రఘు చలించలేదు. ఈ తుఫానును ఏదో ఒకనాడు ఎదుర్కోవలసి వస్తుందని అతనికి బాగా తెలుసు. అందుకతను సంసిద్ధుడు కూడా.

''శేఖర్ ! .... అనవసరంగా ఉద్రేక పడకు. తరువాత నువ్వే పశ్చాత్తాప పడతావు. కూర్చో. రాధ నా ప్రేయసన్న అనుమానం నీ కెలా కలిగింది.?'

శేఖర్ అట్టహాసంగా నవ్వాడు. నవ్వు వెనక అతని కళ్ళు క్రోధంతో ఎర్రబడ్డాయి.

'రెండేళ్ల క్రితం నీదగ్గర చూసిన ఫోటో ఎవరిది ?.... రాధది కాదూ?' అని గర్జించాడు.

'కాదు .... '

'రఘు ! .... నువ్వు 'లా' చదివినమాట నిజమే కావచ్చు. కాని కళ్లను మోసగించలేవు. ఆత్మను వంచించలేవు.'

'శేఖర్ ! .... కాస్త ఓపికపట్టు. ఆమె రాధ కాదు. మాలతి.'

'పేరు మారుస్తున్నావా ?'

'లేదు. ఆమె రాధ అక్కయ్య మాలతి. వీళ్లిద్దరూ కవలపిల్లలు. రాధ పట్నంలో మావయ్య దగ్గర చదువుకునేది. ఆ మావయ్య ఒక్క అమ్మాయి బాధ్యత మాత్రం వహించటానికి ఒప్పుకున్నాడు. అందుకే మాలతి—అంటే నా ప్రేయసి —తల్లి దగ్గరే ఉండిపోయింది. నువ్వు రాధ పుట్టు పూర్వోత్తరాలు కనుక్కోలేదు. ఆమె అందం చూసి వెంటనే పెళ్లి చేసుకున్నావు. అంతే. సందర్భం దొరికితే రాధనే అడుగు. ఆమె నిజం చెప్పటానికి సంశయిస్తుంది. తన అక్క లేచిపోయిందంటే ఆమెకు తలవంపు కదా ! .... అందుకే నీ దగ్గర అంతా దాచివుంచింది.'

శేఖర్ కుర్చీలో కూలబడిపోయాడు.

పది నిముషాల వరకు మాట్లాడలేదు.

'రఘు ! .... నేను నమ్మలేను......నమ్మలేకుండా ఉన్నాను.'

'ఎవరైనా అంతే. కేవలం ఫోటో చూసి తొందర పడ్డావు. రాధను నిజానిజాలు అడగాల్సింది .... నువ్వు ఆమెను నా కప్పగించావు. ఆమెకు వెలుగు చూపించమన్నావు .... చూపించాను. విశాఖలో మెడిసిన్ చదువుతోంది. హాస్టలులో ఉంది. ప్రతి మగాడితోనూ తిరగమన్నానని అపవాదు వేశావు. మన స్త్రీత్వ పరిశీలన తెలిసిన నువ్వు కూడా ఇలా అనటం నాకు ఆశ్చర్యంగావుంది. మంచి చెడులు అనుభవం మీద కాని తెలియవు. రాధ మంచికోసం వెతికింది. చివరి కది దొరికింది. ఆమెలో ఏ లోపాన్ని కనుక్కోలేవు. కనుక ఆమె శీలాన్ని, నడకను సంశయించనక్కర్లేదు. శేఖర్ ! నువ్వు అనుకోకుండా, పెద్ద అపరాధంచేసి బాధపడుతున్నావు. ఇప్పటికైనా మించిపోయినదేమీ లేదు. రాధ నాటికీ, నేటికీ నీ భార్య.'

'అవును రఘు ! .... ఆమాట నిజం. ఈ నాడే వెళ్లి ఆమెను కలుసుకుని క్షమాపణ చెప్పుకుంటాను. నా రాధ నాకు మళ్లీ దొరికితీరుతుంది .... నిన్ను తెలివితక్కువగా ఏవేవో అన్నందుకు క్షమించు. నా మాటను గౌరవించి ఆమెకు ఆశ్రయం చూపావు. భర్త వదలిపోయిన భార్య మనసులో ఆశను చిగురింపజేసి, ఆనందంగా జీవించేట్టు చేయటానికి ఎంతటి ఓర్పు, తెలివి, సంస్కారం ఉండాలో నాకు బాగా తెలుసు. నీ రుణం .... '

శేఖర్ చిన్నపిల్లాడిలా ఏడ్చాడు. కొన్ని లక్షల భిన్న భావాలు, బాధలు అతని గుండెలో వీరవిహారం చేశాయి.

'రఘు ! .... వస్తాను. రాధను కలుసుకోవాలి. నన్ను క్షమించమనాలి.'

'మంచిది శేఖర్ ! .... గడచినదాన్ని గురించి బాధ పడటం వివేకం కాదు. ఆమాట నీకు నేను చెప్పక్కర్లేదు.'

'కాని రఘు ! .... డాక్టరుగా ఉండాలన్న కోర్కె ఆమె కెలా కలిగింది ?'

'ఒక్కసారిగా కలుగలేదు. మొదట్లో ఆడంబరంగా తిరిగింది. ఆ మార్గం నచ్చక విరాగిణిగా ఉంది. చివరకు 'మనం బతికేది మరొకరి కోసం. నలుగురికీ సేవ చేయటంలో ఆనందం ఉంది' అంటూ మెడిసిన్‌లో దిగింది. నిజంగా ఆమె డాక్టరైతే ఎందరో చావులోంచి బతుకుతారు. ఎందుకంటే, ఆమె వైద్యవృత్తిని స్వార్థం కోసం కాక, పరోపకారార్థం చేపట్టింది. నువ్వు ఆమెను చదువుకోనీ.'

'అక్కర్లేదు .... స్త్రీకి సంసార సౌఖ్యంకంటె గొప్పదేమీ లేదు.'

'మంచిది. రాధ నీది. ఆమె భవిష్యత్తును నిర్ణయించటం నీపని. కాని మరోసారి నువ్వామెకు పుస్తె కట్టాల్సుంటుంది. అర్థమైందా ?'

శేఖర్ అర్థమైనట్టు తల పంకించాడు.

మరో పది నిముషాలకు మిత్రులు విడిపోయారు.

శేఖర్ నడుస్తూ ఆలోచనలో మునిగిపోయాడు.

*　　　*　　　*

మూడు రోజుల తరువాత రఘుకు ఉత్తరం వచ్చింది.

'ప్రియమైన రఘు—మనిషిని మార్చేది సంఘటనలే— తనంతట తను ఎన్నడూ మారలేడు. నేను కుదురుగా ఉండి ఉంటే రాధ సంసారంలో పడి పిల్లల్ని కనేది. కాని ఆమెలో ఉన్నతాశయాలు పరుగెడుతున్నాయి. నువ్వన్నట్టు ఆమెవలన ఎందరో ఉపయోగం పొందుతారు. అలాంటప్పుడు నా స్వార్థం కోసం ఆమెను, ఆమె ఆదర్శాన్ని తుడిచివేయటం న్యాయం కాదు.

ఆలోచించి నిర్ణయించుకున్నా. రాధను నేను కలుసుకోను. ఆమె జీవితంలో ప్రవేశించక దూరంగా ఉంటాను. ఆమెను చదువుకోనీ. నీ విశాల హృదయం ఆమె కెప్పుడూ దారి చూపుతుంది.

ఒక్క కోరిక—నువ్వు నన్ను కలుసుకున్నట్టు రాధకు తెలియనివ్వకూడదు. నీకు న్యాయమని తోస్తే, అవుసర మనిపిస్తే నేను ఆమె నెందుకు వదలిపోయానో వివరించు. నన్ను బాగా అసహ్యించుకోనీ—నా జ్ఞాపకం కొంచెమైనా ఉంటే మర్చిపోనీ.

ఆమె తీసేసిన మంగళసూత్రం మరి కట్టుకోవద్దు. జీవితాంతం అవివాహితగా ఉండనీ—ఆమెకు నచ్చితే సుమా !.... ప్రయత్నపూర్వకంగా ఇక నిన్ను కలుసుకోను రాధతో ఉన్నప్పుడు నేను ఎదురుపడితే చూడనట్టు వెళ్ళిపో. ఒకవేళ ఆమె దృష్టి నన్ను కనుక్కుంటుందన్న అనుమానం కలిగితే, దాన్ని మరో దిసకు తిప్పేయి .... మరి సెలవు.'

రఘు గట్టిగా నిట్టూర్చి ఉత్తరాన్ని ముక్క ముక్కలుగా చింపివేశాడు.


ఓం తత్ సత్

సుఖజీవిత సేవ

కే. టి. కృష్ణమూర్తి ఆచ్చారిగారి



"మేల్ మాయిల్ మందు"

ప్రపంచములో ప్రఖ్యాతిగాంచిన మేహ, కుష్ఠురోగ నివారిణి-

మేహ కుష్ఠవ్యాధివల్ల కష్టపడువారలకు పునర్జన్మమిచ్చు అద్భుత సంజీవి-మేహరోగ నివారణ నూనె, లేహ్యము.

నల్లమేహ, ఎఱ్ఱమేహ, పొడలు, మేహరణములు, తిముర్లు, మతిమాంద్యము, కుష్ఠములు, పిత్తకారితము సూతకి వ్యాధులు, వాతము, గుల్మము, తెలుపు, ఉష్ణం, గ్రంధి, కాళ్లచేతులు మంటలు, రక్తబలహీనం, గజ్జి, దురద, వీర్యనష్టం. మూలవ్యాధి, మలబద్ధకము మొదలైన అన్ని విధముల దుర్ పీరు వ్యాధులను అతి సులభముగా పోగొట్టును.

40 రోజులు (1 మండలము) నూనె, లేహ్యము 7-0-0 తపాల్ ఖర్చు వేఱు: వివరములకు కేట్లాగులో చూడవచ్చును.

శ్రీ పరమాత్మ తైలము (స్నానమునకు శ్రేష్ఠమైనది)

కండ్లు మంట, కనుచూపు తక్కువ, మెదడు ఉష్ణం, ముక్కులో రక్తము కారుట, కామాల. దగ్గు, గసదగ్గు, శ్వాసకోశమునందు గలుగు అన్ని వ్యాధులను నివర్తి చేసి రక్తశుద్ధిని కలిగించి దేహమునకు సుఖము నిచ్చును.

★

నేకులో రాగోరువారు గమనించవలసినది :

జనుల సౌకర్యమును అనుసరించి ప్రతి ఆదివారము - గురువారము ఉ॥ 9 మొదలు సా॥ 6 వరకు "విరించి పురం" రైల్వే షనుకు దాపున బస్సు సాండులో మా "లక్ష్మి విలయం"లో విచ్చేసి వుందుము. నేకులో రాగోరు వారు పై తరుణమును ప్రయోజనకరంగా చేసుకోవచ్చును.

K T కృష్ణమూర్తి ఆచ్చారి & సన్సు, 5/22, మేల్ మాయిల్ పోస్టు (N A Dt)